


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 19.08.2025 | సంపుటి : 2 | సంచిక :197 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Thuesday | 19.08.2025 | volume : 2 | Issue : 197 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# పొంగిపొర్లుతున్న వాగులు

**మహారాష్ట్రలో జగిత్యాల వాసుల గల్లంతు**

**ములుగు ఏజెన్సీలో భారీ వర్షాలు.. నిండిన లక్నవరం చెరువు**

## నిండుకుండలా శ్రీరాంసాగర్ ..గేట్లు ఎత్తివేత

**అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క హెచ్చరిక**

**వనదుర్గామాత ఆలయం చుట్టూ మంజీరా ప్రవాహం**



భారీ వర్షాలతకు తోడు ఎగవ నుంచి వస్తున్న వరదతో నిజామబాద్ జిల్లాలోని శ్రీరామ్‌సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో 8 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1088 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 72.23 టీఎంసీలుగా నమోదైంది. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



## భారీ వర్షాలు కురిసే ఛాన్స్


**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

హైదరాబాద్,ఆగస్ట్18: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్, అరెంజ్ అలర్టులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే మరోసారి వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఈ మేరకు ప్రజలందరూ..

- మిగతా 2వ పేజీలో

హైదరాబాద్,ఆగస్ట్18: ఇదిలావుంటే మహారాష్ట్రలోని ఉద్గిర్ వద్ద జగిత్యాల జిల్లా వాసులు గల్లంతయ్యారు. వీరు మహారాష్ట్రకు వెళ్లి తిరిగివస్తుండగా.. కారు వరద నీటిలో కొట్టుకుపోయింది. ఈ ఘటనలో నలుగురు గల్లంతవగా.. ఓ బాలుడి ఆచూకీ లభ్యమైంది. మిగతా వారికోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. బాధితులను హసీనా, సమీనా, ఆఫ్రీన్‌గా

- మిగతా 3వ పేజీలో



06

వినాయకుడి మండపానికి

## 474 కోట్లకు ఇన్సూరెన్స్



06

సైబర్ నేరగాళ్ల నుంచి

## 5,489 కోట్లు స్వాధీనం



# మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడం లేదు

## బిసి రిజర్వేషన్లు అడ్డుకునేందుకు ఇదో సాకు

- రాహుల్‌తో రాజకీయ వైరం ఉంటే తేల్చుకోండి
- బిసి రిజర్వేషన్లు మాత్రం అడ్డుకోవడం సరికాదు
- సర్వాయి పాపన్న విగ్రహానికి శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి

బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడమే లక్ష్యంగా ముస్లిం పేరుతో వాదనలు సృష్టిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మైనార్టీల రిజర్వేషన్లు ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్ ఎలా అమలులో ఉన్నాయో కేంద్రం పరిశీలించాలని, అక్కడ తొలగించే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీపై కోపం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవచ్చుని, కేసులు పెట్టవచ్చుని.. కానీ, ఆయన నమ్మిన బీసీ సాధికారత సిద్ధాంతాన్ని దెబ్బతీయొద్దని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో బీసీలు ముందుకు రావడం రాహుల్ గాంధీ లక్ష్యమని, ఆ సూచనలను అమలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ట్యాంక్‌బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.

02

# శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో విషాదం

## అర్ధరాత్రి రథానికి విద్యుత్ షాక్



- ఘటనా స్థలంలో ఐదుగురు.. చికిత్స పొందుతూ ఒకరు మృతి
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- 5 లక్షల చొప్పన ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- విచారం వ్యక్తం చేసిన మంత్రి శ్రీధర్ బాబు
- ఘటన దురదృష్టకరమన్న కెటిఆర్, కవిత

03

రామంతాపూర్ గోకులే నగర్లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు విషాదం నింపింది. ఇందులో మొత్తం ఆరురుగు దుర్మరణం చెందారు. రథానికి విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. కృష్ణాష్టమి కారణంగా ఆదివారం రాత్రి ఊరేగింపు చేపట్టారు.

# మోదీతో శుభాంశు శుక్లా భేటీ

- రోదసిలోకి తీసుకువెళ్లిన త్రివర్ణ పతాకం అందజేత
- భుజంపై చేయివేసి ముచ్చటించిన ప్రధాని మోదీ

02

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి వెళ్లి సురక్షితంగా వచ్చిన తొలి భారతీయ వ్యోమగామి, గ్రూపు కెప్టెన్ శుభాంశు శుక్లా సోమవారం ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. నాసా యాక్సియం-4 మిషన్‌ను ఇటీవల విజయవంతంగా పూర్తిచేసుకున్న శుక్లా ఆదివారం స్వదేశానికి చేరుకున్న విషయం తెలిసిందే. వ్యోమగాములు ధరించే ప్రత్యేక జాకెట్‌తో లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసానికి ఆయన వచ్చినప్పుడు మోదీ స్వాగతం పలికి ఆప్యాయంగా హత్తుకున్నారు.



# రష్యా చమురుకు భారత్ క్లియరింగ్ హౌస్

## ట్రంప్ సలహాదారుడి అక్కసు

యూఎస్ : అమెరికా చేస్తున్న తాటాకు చప్పుళ్లకు భయపడ కుండా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం ట్రంప్ కార్యవర్గానికి కంటగింపుగా మారింది. తాజాగా శ్వేతసౌధంలోని ఆయన కీలక సలహాదారు పీటర్ నవారో మరోసారి అక్కసు వెళ్లగక్కారు. అమెరికాకు ఓ వ్యూహాత్మక భాగస్వామిలా భారత్ వ్యవహరించాలన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్‌కు రాసిన ఓ కాలమ్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు.

మిగతా 06లో



# కోటిమందికి ఏఐ ఆధారిత పౌరసేవలు

## 2027 నాటికి సాకారమయ్యేలా కృషి

**ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



03

2027 నాటికి ఏఐ ఆధారిత పౌర సేవలను కోటి మంది ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ–, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'ఏఐ – లెడ్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ – ఛాంపియన్స్కాటలిస్ట్స్ ప్రో గ్రామ్' పేరిట ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్(ఐటీ– శాఖ) ఆధ్వర్యంలో ప్రభుత్వాధి కారు లకు జూబ్లీహిల్స్ లోని డా. ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్సిట్యూట్ లో మూడ్రోజుల పాటు– నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.



03

# ఇదో చెత్త సర్కార్

## ప్రభుత్వంపై కేటీఆర్ ఆగ్రహం

తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు పనితీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో శాఖల సమన్వయ లోపంతో ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని మండిపడ్డారు.

# సైలెంట్‌గా వాహన లైఫ్‌టాక్స్ పెంపు

**జీవో 53 విడుదల....14నుంచే పెంచిన టాక్స్ అమలు**




04

తెలంగాణ ప్రభుత్వం వాహనాలపై లైఫ్‌టాక్స్ పెంచింది. ఆగస్టు 14 నుంచి కొత్త రేట్లు అమల్లోకి వచ్చాయి. రవాణా, రోడ్లుభవనాల శాఖ జారీ చేసిన జీఓ నెం.53 ద్వారా మోటార్ వాహనాల పన్ను చట్టం, 1963లోని షెడ్యూల్స్‌లో మార్పులు చేసింది. ఈ మేరకు రెండు, మూడు, నాలుగు చక్రాల నాన్‌ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు పెరిగిన లైఫ్‌టాక్స్ వసూలు చేయనుంది.



# చేనేతలపై జీఎస్టీ ఎత్తేయండి

- జీఎస్టీతో కుదేలయిన చేనేత రంగం
- ప్రధాని మోడీకి మంత్రి తుమ్మల లేఖ

03



# మోదీతో శుభాంశు శుక్లా భేటీ

- రోదసిలోకి తీసుకువెళ్లిన త్రివర్ణ పతాకం అందజేత
- భుజంపై చేయివేసి ముచ్చటించిన ప్రధాని

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి వెళ్లి సురక్షితంగా వచ్చిన తొలి భారతీయ వ్యోమగామి, గ్రూపు కెప్టెన్ శుభాంశు శుక్లా సోమవారం ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. నాసా యాక్సియం-4 మిషన్‌ను ఇటీవల విజయవంతంగా పూర్తిచేసుకున్న శుక్లా ఆదివారం స్వదేశానికి చేరుకున్న విషయం తెలిసిందే. వ్యోమగాములు ధరించే ప్రత్యేక జాకెట్‌తో లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసానికి ఆయన వచ్చినప్పుడు మోదీ స్వాగతం పలికి ఆప్యాయంగా హత్తుకున్నారు. భుజంపై చేయివేసి ఆయనతో కలిసి నడుస్తూ ముచ్చటించారు. తనతోపాటు ఐఎస్-ఎస్‌కు తీసుకువెళ్లిన త్రివర్ణ పతాకాన్ని, యాక్సియం-4 మిషన్‌కు సంబంధించిన జ్ఞాపికను శుక్లా ఆయనకు అందజేశారు. రోదసి నుంచి జూన్ 29న ప్రధానితో శుక్లా ముచ్చటించినప్పుడు వెనుకవైపు ఇదే పతాకం రెపరెపలాడుతూ కనిపించింది. అంతరిక్షం నుంచి తాను తీసిన కొన్ని చిత్రాలను ట్యాబ్లెట్ కంప్యూటర్‌లో చూపిస్తూ వాటి గురించి శుక్లా వివరించారు. అంతరిక్ష అనుభవాలు, శాస్త్ర-సాంకేతిక రంగ పురోగతి, గగన్‌యాన్ మిషన్ వంటివాటిపై శుభాంశుతో చర్చించానని, ఆయన సాహసాన్ని చూసి దేశం గర్విస్తోందని మోదీ 'ఎక్స్'లో తెలిపారు.




# కేంద్ర ప్రభుత్వ రుణం
# రూ.200 లక్షల కోట్లు

- పదేళ్లలో 182% పెరిగిన అప్పు
- 38% ఆదాయం వడ్డీలకే సరి
- దశాబ్దకాలంలో అసలు రూ.32 లక్షల కోట్లు, వడ్డీ రూ.85 లక్షల కోట్ల చెల్లింపు

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.200 లక్షల కోట్లకు చేరింది. ఇది జీడీపీలో 56.1 శాతానికి సమానం. కేంద్రానికి వస్తున్న ఆదాయంలో 37.32% మొత్తం రుణాలపై వడ్డీ చెల్లింపులకే వెళ్తోంది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. సోమవారం లోక్‌సభలో తమిళనాడు కాంగ్రెస్ సభ్యుడు ఎం.కె. విష్ణుప్రసాద్ అడిగిన ప్రశ్నకు ఆమె ఈమేరకు బదులిచ్చారు. 2015-16లో కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ.70.98 లక్షల కోట్ల మేర ఉండగా, పదేళ్లలో అది 181.99%మేర పెరిగింది. ఇదే సమయంలో జీడీపీలో రుణ నిష్పత్తి 51.5% నుంచి 56.1%కి చేరింది. దశాబ్దకాలంలో కేంద్రం రూ.117.78 లక్షల కోట్ల అప్పు చెల్లించింది. ఇందులో అసలు కింద రూ.32.61 లక్షల కోట్లు, వడ్డీ కింద రూ.85.17 లక్షల కోట్లు చెల్లించింది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో వడ్డీ చెల్లింపుల కోసం 2015-16లో 36.96% మొత్తం పోగా, ఇప్పుడు అది 37.32%కి పెరిగింది.

### రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు రూ.81 లక్షల కోట్లు

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రూ.200 లక్షల కోట్ల రుణానికి తోడు రాష్ట్ర ప్రభుత్వాలు మరో రూ.81 లక్షల కోట్ల అప్పు చేశాయి. 2025 మార్చి 31 నాటికి దేశంలోని 28 రాష్ట్రాల మీద రూ.81,54,004 కోట్ల రుణం ఉన్నట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి ఇచ్చిన మరో సమాధానం వెల్లడించింది. ఇందులో అత్యధికంగా తమిళనాడుకు రూ.9.55 లక్షల కోట్ల అప్పు ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ఉత్తర్‌ప్రదేశ్ (రూ.8.57 లక్షల కోట్లు), మహారాష్ట్ర (రూ.8.12 లక్షల కోట్లు), కర్ణాటక (రూ.7.25 లక్షల కోట్లు) నిలిచాయి.



# గొర్రెల కాపరులను రక్షించిన అధికారులు

**కామారెడ్డి, ఆగస్ట్ 18 :** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం చెట్లూరుగ్రామంలో భారీ వరద నీటిలో చిక్కుకుపోయిన నలుగురు మనుషులు మరియు 656 గొర్రెలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం రక్షించింది. గొర్రెలను మేపడానికి వెళ్లిన కాపరులు గొర్రెలతో సహా వరదనీటిలో చిక్కుకు పోయారు. అనూహ్యంగా వరద రావడంతో వారు చిక్కుకున్నారు. దీంతో సమాచారం అందుకున్నకలెక్టర్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, వారిని రక్షించారు.

# మూసీలో కొట్టుకుపోయిన యువకుడు

**హైదరాబాద్, ఆగస్ట్ 18 :** నగరంలోని చాదర్‌ఘాట్ బ్రిడ్జి పైనుంచి గుర్తుతెలియని యువకుడు మూసీ నదిలోకి దూకాడు. టీ-ఎస్ 11 ఎఫ్‌ఏ 4052 బైక్‌ను బ్రిడ్జిపై పార్క్ చేసి దూకినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. నదిలో నీరు అధికంగా ఉండటంతో వరద ప్రవాహానికి యువకుడు కొట్టు-కుపోయాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు. మూసీలోకి దూకిన యువకుడిని మందుగుల్ల కిరణ్‌గౌడ్‌గా ప్రాథమికంగా గుర్తించారు. అయితే ఆత్మహత్యకోసమే దూకి ఉంటాడని భావిస్తున్నారు.

# మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడం లేదు

- బిసి రిజర్వేషన్లు అడ్డుకునేందుకు ఇదో సాకు
- రాహుల్‌తో రాజకీయ వైరం ఉంటే తేల్చుకోండి
- బిసి రిజర్వేషన్లు మాత్రం అడ్డుకోవడం సరికాదు
- సర్వాయి పాపన్న విగ్రహానికి శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 18 :** బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడమే లక్ష్యంగా ముస్లిం పేరుతో వాదనలు సృష్టిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మైనార్టీల రిజర్వేషన్లు ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్ ఎలా అమలులో ఉన్నాయో కేంద్రం పరిశీలించాలని, అక్కడ తొలగించే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీపై కోపం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవచ్చని, కేసులు పెట్టవచ్చని.. కానీ, ఆయన నమ్మిన బీసీ సాధికారత సిద్ధాంతాన్ని దెబ్బతీయొద్దని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో బీసీలు ముందుకు రావడం రాహుల్ గాంధీ లక్ష్యమని, ఆ సూచనలను అమలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ట్యాంక్‌బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో పాపన్నగౌడ్ నిరూపించారన్నారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజుకు ఇచ్చాయని విమర్శించారు. గతంలో ఖిలాషాపూర్ కోటను కాలగర్భంలో కలపాలని చూశారని దుయ్యబట్టారు. చరిత్ర స్ఫూర్తి కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. భవిష్యత్తు తరాలు స్ఫూర్తి పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. గాంధీ కుటుంబం దేశానికి గొప్ప వరం. శాంతితో యుద్ధాన్ని గెలవవచ్చు అని గాంధీ నిరూపించారు. దేశం కోసం ఇందిరా గాంధీ,



రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సోనియాగాంధీ పదవులు త్యాగం చేశారు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు ఆ కుటుంబం గొప్ప నాయకత్వాన్ని అందించింది. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌ను గుర్తించినట్లే.. గాంధీ కుటుంబాన్ని గుర్తిస్తున్నారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మన ప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శం అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సర్దార్ సర్వాయి పాపన్నకు సముచిత గౌరవం ఇవ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. హుస్నాబాద్‌లోని పాపన్న కోటను లీజుకు ఇచ్చిందని, తాము అయితే ఆ కోటను సంరక్షించడానికి చర్యలు ప్రారంభించామని వెల్లడించారు. హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్‌ను పోటీ- చేయించడం కూడా అదే భావనలోనుంచే జరిగిందని అన్నారు. గాంధీ కుటుంబాన్ని దేశానికి గొప్ప వరంగా అభివర్ణిస్తూ.. వారిచ్చే హామీ శిలాశాసనం లాంటిదేనని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ సూచించినట్లు-గా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ దిశగా రాష్ట్రవ్యాప్తంగా కుల గణనను నిబద్ధతతో పూర్తి చేసామని, తాము చేసిన సర్వేలో తప్పు ఎక్కడ ఉందో చూపించమని అసెంబ్లీలోనే సవాల్ చేశామని ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్ల అమలుకు సంబంధించి తీసుకున్న రాజకీయ, న్యాయ చర్యలను సీఎం వివరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రపతికి పంపినప్పటికీ అది ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉందని చెప్పారు. తాము తెచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించారని, కేంద్ర స్థాయిలో దానికి ఆమోదం వచ్చేలా చూడాల్సిన కేంద్ర నేతలు వాదనలతో కాలం గడుపుతున్నారని ఆక్షేపించారు. 2018లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన చట్టమే ప్రస్తుతం 50 శాతం దాటి రిజర్వేషన్లు ఇవ్వడంలో అడ్డంకిగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మత ప్రాతిపదికన ఏ రిజర్వేషన్లు ఉండవని స్పష్టం చేశారు. తాము పంపిన బిల్లు గానీ, ఆర్డినెన్స్ గానీ మతాధారిత రిజర్వేషన్లను ప్రతిపాదించలేదని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ చిత్రనిర్మాణ కేంద్రంగా హైదరాబాద్

### అవార్డుపొందిన సినీ ప్రముఖులకు సిఎం సన్మానం

**హైదరాబాద్, ఆగస్ట్ 18 :** భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు.. సినిమా రంగం ప్రోత్సాహకానికి అవసరమైన చేయూతను అందిస్తాంమని ఆయన తెలిపారు. 71వ జాతీయ ఫిల్మ్ అవార్డుల్లో వివిధ విభాగాల్లో ఎంపికైన సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవార్డు గ్రహీతలైన భగవంత్ కేసరి సినిమా డైరెక్టర్ అనిల్ రావిపూడి, హను మాన్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, హను మాన్ సినిమాకు విజువల్ ఎఫెక్ట్ కు సంబంధించి వెంకట్, శ్రీనివాస్, టీమ్ సభ్యులు, ఫైట్ మాస్టర్స్ నందు, పృథ్వీ, బేబి సినిమా డైరెక్టర్ సాయి రాజేశ్, సింగర్ రోహిత్ లను సన్మానించారు. మరిన్న మంచి చిత్రాలురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో హను మాన్ సినిమా



నిర్మాతలు చైతన్య రెడ్డి, నిరంజన్ రెడ్డి, బేబి సినిమా నిర్మాత ఎస్కేఎన్, భగవంత్ కేసరి నిర్మాత గారపాటి సాహు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**చంద్రుగొండ :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే పేదలకు న్యాయం జరుగుతోందని, అర్హులైనవారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో ఆయన సోమవారం పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు చంద్రుగొండ చేరుకుంటారని, అక్కడి నుంచి బెండాలపాడు వెళ్లి ఇందిరమ్మ గృహాలకు ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. అనంతరం దామరచర్ల సమీపంలో జరగనున్న బహిరంగ సభకు హాజరవుతారని వెల్లడించారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పైలాన్ నిర్మాణ ప్రాంతాన్ని, హెలిప్యాడ్ ప్రదేశాన్ని, బహిరంగసభ ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి విడతగా 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు చొప్పున రూ.22.50 వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్‌నాయక్, కోరం కనకయ్య, మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, రాష్ట్ర



నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సమీకృత భవనాలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రేపు గచ్చిబౌలి కార్యాలయానికి సీఎం శంకుస్థాపన

**హైదరాబాద్:** ప్రజల సౌకర్యం కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సమీకృత భవనాలు నిర్మిస్తున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గచ్చిబౌలిలో నిర్మించనున్న భవనానికి సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఈ ఏర్పాట్లపై సోమవారం మంత్రి రిజిస్ట్రేషన్లశాఖ అధికారులతో సమీక్షించారు. 'ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికి శాఖలో విప్లవాత్మకమైన సంస్కరణలు చేపట్టాం. పర్యవేక్షణ, పనితీరు మెరుగు కోసం పలు కార్యాలయాలను ఒకే చోటికి చేర్చుతున్నాం. మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 సమీకృత భవనాల పరిధిలోకి తీసుకొస్తాం. రిజిస్ట్రేషన్లకు రాష్ట్రంలో ప్రారంభించిన స్లాట్ బుకింగ్‌లు మూడు లక్షలు దాటాయి' అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.



# భట్టి, ఉత్తమ్‌లపై కేసుల కొట్టివేత

**హైదరాబాద్:** ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలపై 2021లో నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేస్తూ హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దుచేయాలని పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ 2021 జనవరి 19న సచివాలయం నుంచి రాజ్‌భవన్ వరకు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో సహా కాంగ్రెస్ నేతలు ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారని, తెలుగుతల్లి విగ్రహం వద్ద సమావేశం నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారంటూ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. వీటిని కొట్టివేయాలని కోరుతూ ఉత్తమ్, భట్టి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన జస్టిస్ కె.లక్ష్మణ్ కేసులను కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. ర్యాలీ, సభల కారణంగా శాంతి భద్రతలకు భంగం వాటిల్లినట్లు ఎలాంటి ఆధారాలు సమర్పించలేదని, రెచ్చగొట్టే ప్రసంగాలకు ఆధారాల్లేవన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ మాజీ ఎంపీ జి.రంజిత్‌కుమార్‌రెడ్డిపై ఉన్న రెండు కేసులను కూడా కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపించారు.

# వేములవాడలో భక్తుల రద్దీ

**వేములవాడ, ఆగస్ట్ 18 :** రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రం వేములవాడలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో భారీగా భక్తులు బారులుతీరారు. ఈ నేపథ్యంలో గర్భాలయంలో ఆర్జిత అన్న పూజల సేవలను అధికారులు రద్దుచేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు వేచిఉండటంతో స్వామివారి దర్శనానికి 3 గంటల సమయం పడుతున్నది. తెల్లవారుజామునే రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కోడె మొక్కులు తీర్చేందుకు పలువురు ముందుకు వచ్చారు.

# గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

- కేంద్రం నిధులు సకాలంలో అందేలా చర్యలు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, ఆగస్ట్ 18 :** గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే దిశగా చర్యలు చేపడతామని, విద్యా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన సచివాలయంలో శాఖపరమైన సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం తరపున సామాజిక సంక్షేమ శాఖకు అందాల్సిన నిధుల విషయంమై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి మరియు సామాజిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలతో కలిసి నిధులపై విస్తృత చర్చ జరిపి, అన్ని అంశాలను సమగ్రంగా సమీకరించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించ దానికి నివేదిక సిద్ధం చేసినట్టు- మంత్రి గారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో దీనిపై సమీక్ష చేయకుండా గత పాలకులు నిర్లక్ష్యం చేయడంతో, కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు రాక పేద ప్రజలకు అందాల్సిన అనేక సంక్షేమ కార్యక్రమాలు నష్టపోయాయని తెలిపారు. అలాగే, మంత్రిగా బాధ్యత చేపట్టిన తర్వాత ఒక దాని తర్వాత ఒకటి సమీక్షిస్తూ, సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ విధంగా అందుబాటులోకి తేవాలి అనే అంశంపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటున్నానని తెలిపారు. అలాగే, గురుకులాల్లో డైటింగ్ విషయంలో నాణ్యత ఉండాలని, దానికి కావాల్సిన నిధులు ప్రభుత్వం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలోనే ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను ప్రత్యక్షంగా సమర్పించి, రాష్ట్రానికి రావాల్సిన నిధులు త్వరితగతిన పొందేలా కృషి చేస్తామని మంత్రి అన్నారు.

# రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్‌కు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్:** జాతీయ క్రీడా నియమావళిని అమలు చేయకపోవడంపై వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్‌కు హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. 2011 జాతీయ క్రీడా నియమావళిని అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ కబడ్డీ కోచ్ సి.పవన్‌కుమార్ యాదవ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అసోసియేషన్‌లో పార్ట్‌టైమ్ సభ్యులు, ఉద్యోగులు ఉంటున్నారన్నారు. పోటీల నిర్వహణ, శిక్షణలకు ప్రభుత్వ సాయం అందకుండా ఆదేశాలు జారీ చేయాలని, దీనిపై విచారణ జరిపించాలని కోరారు. అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ ఇందులో ప్రభుత్వ పాత్ర పరిమితమేనన్నారు. వాదనలను విన్న ధర్మాసనం అసోసియేషన్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను 4వారాలకు వాయిదా వేసింది.

# పొంగిపొర్లుతున్న వాగులు

మొదటి పేజీ తరువాయి

గుర్తించారు. ములుగు జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఏజెన్సీ మండలాలు వెంకటాపురం, వాజేడు, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, తాడ్వాయిలో ఎడతెరిపి లేకుండా వాన దంచికొడుతోంది. కుండపోత వర్షంతో రోడ్లపై వరద పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. మంగపేటలో 19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు కాలనీలు, ఇళ్లలోకి వరద నీరు చేరింది. వెంకటాపురం శివాలయం వీధిలో రోడ్లు జలమయమయ్యాయి. మంగపేటలో పంట పొలాలు నీట మునిగాయి. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క సూచించారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. అన్నదాతల ఆశలకు జీవం పోస్తూ.. లక్నవరం జలాశయం మత్తడి పోస్తుంది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం జలాశయం పూర్తిస్థాయిలో అయిదు అంగుళాల మేర మత్తడి పోస్తుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టానికి మించి వరద ప్రవాహం ఎగువ ప్రాంతం నుంచి వస్తుండడంతో జలాశయం మత్తడి పరవళ్లు తొక్కుతోంది. మొన్నటి వరకు చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా.. గోవిందరావుపేట మండలంలో ఆశించిన మేర వర్షపాతం నమోదు కాలేదు. సాగు నీటి అవసరాలు తీరుస్తున్న లక్నవరం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టాన్ని దాటింది. దీంతో దీని కింద ఉన్న 13 వేల ఎకరాల ఆయకట్టుకు భరోసా ఏర్పడింది. కాకతీయుల కాలంలో రైతుల సాగు నీటి అవసరాలకు కోసం నిర్మించిన ఈ జలాశయం ఊహించని రీతిలో ఇప్పుడు పర్యాటకులకు స్వర్గధామంలా విలసిల్లుతోంది. సహజ సిద్ధమైన ప్రకృతి అందాలతో సందర్శకులను మరో లోకంలో విహరింపజేస్తూ.. సంభ్రమాశ్చర్యాలకు లోను చేస్తుంది. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం దాతర్ పల్లిలో కట్టు కాల్వ తెగిపోయింది. దీంతో పట్టణంలోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. మరోవైపు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని వట్టూర్, కిష్టాపూర్, వెంకటాయపల్లి, గుండ్రెడ్డిపల్లి, హల్దీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మనోహరాబాద్ మండలం రామాయపల్లి వద్ద జాతీయ రహదారిపై నీరు చేరడంతో పోలీసులు వాహనాలు దారి మళ్లించారు. ఎంపీడీవో, పోలీసు స్టేషన్లలకు వెళ్లే రహదారిపై ఉధృతంగా వరద ప్రవహిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వర్షం నీరు చేరడంతో సిబ్బంది, స్థానికుల సహాయంతో బయటకు వచ్చారు. మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం సమీపంలో ఉన్న మంజీరా ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాలు, వరద కారణంగా ఎగువ ఉన్న సింగూర్ జలాశయంలో నీటిమట్టం పెరిగింది. దీంతో అధికారులు ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు చేరడంతో మంజీరా నదిలో వరద ప్రవాహం పెరిగింది. ఈ క్రమంలో ఏడుపాయల ఆలయం వద్ద నదీ పాయ ఉధృతంగా ప్రవహిస్తోంది. అందుకు సంబంధించిన డ్రోన్ దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ప్రకృతి రమణీయత కలిగిన పాండవలంక జలపాతం పర్యటకులను కనువిందు చేస్తోంది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామ శివారులోని రామగిరి ఖిల్లా గుట్టలను ఆనుకొని పాండవలంక జలపాతం ఉంది. పాండవులు వనవాసం చేసిన సమయంలో ఇక్కడ కొన్ని రోజులు నివాసం ఉన్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. పాండవులు జలకాలాడేందుకు ఈ జలపాతాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు చరిత్ర చెబుతోంది. ఇలాంటి ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన పాండవలంక జలపాతాన్ని సందర్శించేందుకు పర్యటకులు భారీగా వస్తున్నారు. కొండల్లోంచి జాలు వారుతున్న జలపాతం వద్ద చిన్నా పెద్దా అనే తేడా లేకుండా సందడి చేస్తున్నారు. భారీ వర్షాలతో నల్లగొండ జిల్లాలోని డిండి జలాశయం నిండుకుండలా పరవళ్లు తొక్కుతూ కనువిందు చేస్తున్నది. ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి దుందుభి వాగు ద్వారా నల్గొండ జిల్లా డిండి జలాశయానికి వరద కొనసాగుతోంది. అదంతా స్పిల్‌వే, మత్తడి, ఎడమ కాల్వ ప్రధాన తూముల ద్వారా దిగువకు దూకుతోంది. సమీపంలోని వంతెనపై ప్రయాణించే వారంతా కాసేపు ఆగి.. జలసౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మేడ్చల్ నుంచి గౌడవెల్లి రహదారిపై వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మూడు చింతలపల్లి మండలం ఉద్దెమర్రి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మూడు చింతలపల్లి ఉద్దెమర్రి మధ్య రాకపోకలు నిలిచిపో యాయి. ఎవరూ అటు వైపు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. లక్ష్మాపూర్ అలుగు పారి ప్రవహిస్తోంది. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రామాలయం వద్ద రహదారిపై నుంచి వాగు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పోలీసులు వాగుల వద్దకు వెళ్లవద్దని ప్రజలను హెచ్చరించారు.



## భారీ వర్షాలు కురిసే ఛాన్స్

మొదటి పేజీ తరువాయి

అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే ఛాన్స్ ఉందని ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని పేర్కొంది. వర్షం పడే సమయంలో చెట్ల కింద కూడా ఉండకూడదని హెచ్చరిస్తుంది. ప్రయాణాలు మానుకోవాలని, లేని పక్షంలో వాయిదా వేసుకోవాలని తెలుపుతుంది. భారీ వర్షాల కారణంగా రోడ్లు, బస్టాండ్, రైల్వే స్టేషన్లు జలమయం అవుతున్నాయి. కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందస్తూ.. చర్యలు చేపడుతుంది. ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ.. అధికారులను ప్రజలతో సమన్వయం అయ్యేలా.. చూస్తుంది.

## చేనేతలపై జీఎస్టీ ఎత్తేయండి

- జీఎస్టీతో కుదేలయిన చేనేత రంగం
- ప్రధాని మోడీకి మంత్రి తుమ్మల లేఖ



**హైదరాబాద్, ఆగస్ట్ 18 :** చేనేత ఉత్పత్తులపై వెంటనే జీఎస్టీ తొలగించాలని కోరుతూ ప్రధాని మోదీకి తెలంగాణ చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. జిఎస్టీ భారంతో చేనేత కుదేలయ్యిందన్నారు. చేనేతలను ఆదుకునేందుకుప్రోత్సహించాల్సి ఉందన్నారు. కేంద్ర హస్త కళలు, చేనేత మంత్రిత్వ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు కూడా లేఖ పంపారు. రాష్ట్ర హస్తకళల పరిశ్రమకు ఊపిరిలాంటి చేనేత రంగం, చేనేత ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం విధించిన 5 శాతం జీఎస్టీతో ప్రస్తుతం ఆ రంగం తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటోందని ప్రధాని, కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జీఎస్టీ వల్ల నష్టపోతున్న నేతన్నలు తమ సంప్రదాయ వృత్తిని వదిలి వలస వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. సాధారణంగా ఖాదీ రంగం, చేనేత రంగం రెండూ సహజ సిద్ధమైన గ్రామీణ పరిశ్రమలుగా ఒకే విధంగా ఉన్నప్పటికీ.. ఖాదీ ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయింపు ఉండగా, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ కొనసాగించడం అన్యాయం. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల సంఘాలు, కార్మికులు ఈ పన్నును వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చేనేత కార్మికుల ప్రయోజనాలు కాపాడటం తోపాటు- నిరంతరం ఉపాధి కల్పించేందుకు భారతీయ చేనేత కళా వారసత్వం భావితరాలకు అందించడానికి చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ మినహాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే ఈ రంగం.. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులకు జీవనాధారమైందని పేర్కొన్నారు. అందం, నాణ్యత, సృజనాత్మకతకు అద్దం పట్టే పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, నారాయణపేట చీరలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీస్, కరీంనగర్ డబుల్ క్లాత్ చెద్దర్లు, ఇతర చేనేత వస్త్రాలు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందాయి. వీటిలో ఆరు రకాల ఉత్పత్తులు జియోగ్రాఫికల్ ఇండికేషన్ కింద నమోదయ్యాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 23,046 మంది చేనేత కార్మికులు, 34,569 మంది అనుబంధ కార్మికులు ఈ రంగంలో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ముడి సరకుల ధరలు పెరగడం, పవర్‌లూమ్, మిల్ రంగాలు తక్కువ ఉత్పత్తి వ్యయంతో వస్త్రాలు తయారు చేయడంతో మార్కెట్లో చేనేత వస్త్రాలు తయారు చేసే నేత కార్మికులకు గిరాకీ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు 5 శాతం జీఎస్టీ విధించడం వల్ల చేనేత ఉత్పత్తుల ధరలు పెరిగి వినియోగం తగ్గిపోతుంది. కార్మికుల జీవనాధారం సంక్షోభంలో పడుతోంది.



## ఇదో చెత్త సర్కార్

### ప్రభుత్వంపై కేటీఆర్ ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్ట్ 18 :** తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు పనితీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో శాఖల సమన్వయ లోపంతో ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని మండిపడ్డారు. వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఇదొక 'చెత్త' సర్కారు..!. రాష్ట్ర మున్సిపల్ శాఖ, ఆరోగ్య శాఖల సమన్వయ లోపంతో ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్త కుప్పలతో హైదరాబాద్ నగరం, రాష్ట్రంలోని ఇతర పట్టణాలు కంపుకొడుతున్నాయి. ఈ వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు- దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి.' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'బీఆర్ఎస్ హయాంలో వర్షాకాలానికి 2 నెలల ముందు నుంచే సీజనల్ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలపై మున్సిపల్ శాఖ, జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖలు సమీక్షా, సమన్వయ సమావేశాలు నిర్వహించి, ముందస్తు చర్యలు చేపట్టేవి. కానీ ఇప్పుడా పరిస్థితులు కనిపించడం లేదు. ప్రజలు ఈసురోమని అలమటిస్తుంటే పాలకులు మాత్రం 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్లలో బిజీగా ఉన్నారు..!' అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో విషాదం

### అర్ధరాత్రి రథానికి విద్యుత్ షాక్

- ఘటనా స్థలంలో ఐదుగురు.. చికిత్స పొందుతూ ఒకరు మృతి
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- 5 లక్షల చొప్పన ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- విచారం వ్యక్తం చేసిన మంత్రి శ్రీధర్ బాబు
- ఘటన దురదృష్టకరమన్న కెటిఆర్, కవిత

**హైదరాబాద్, ఆగస్ట్18 :** రామంతాపూర్ గోకులే నగర్లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు విషాదం నింపింది. ఇందులో మొత్తం ఆరురుగు దుర్మరణం చెందారు. రథానికి విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. కృష్ణాష్టమి కారణంగా ఆదివారం రాత్రి ఊరేగింపు చేపట్టారు. రథాన్ని లాగుతున్న వాహనం మరమ్మతుకు గురికావడంతో దాన్ని పక్కన నిలిపివేశారు. అనంతరం యువకులు రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో రథానికి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో రథం లాగుతున్న తొమ్మిది మందిలో ఐదుగురు అక్కడిక్కకడే మృతిచెందగా.. నలుగురు తీవ్రగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో ఒకరు చికిత్స పొందుతూ మృతిం చెందారు. ఈ ఘటనతో రామంతపూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన స్థానికులు వెంటనే తేరుకొని ప్రాథమిక చికిత్స చేపట్టి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఐదుగురు మృతిచెందినట్లు- వైద్యులు ధ్రువీకరించారు. మరో నలుగురిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మృతిచెందిన వారిలో కృష్ణయాదవ్ (21), సురేశ్ యాదవ్(34), శ్రీకాంత్‌రెడ్డి(35), రుద్రవికాస్(39), రాజేంద్రరెడ్డి(45)తో పాటు- మరొకరు ఉన్నట్లు- గుర్తించారు. వారి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గన్‌మెన్ శ్రీనివాస్ సైతం ఉన్నట్లు సమాచారం. రామంతాపూర్ ఘనటలో మృతిచెదిన బాధితులకు ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అయితే ఈ ఘటనపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరో 100 మీటర్లలో శోభాయాత్ర ముగుస్తుందనగా ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నామని.. గాయపడిన వారి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. కేబుల్ వైర్ ద్వారా కరెంట్ సరఫరా జరిగి ఈ ప్రమాదం జరిగినట్లు- అధికారులు చెబుతున్నారని అన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేశారు. దర్యాప్తు నివేదిక వచ్చాక బాధ్యుతలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రేటర్ హైదరాబద్‌లో కేబుల్ వైర్లు, కరెంటు తీగలపై స్పెషల్ డ్రైవ్ కు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. నలుగురిలో చికిత్స పొందుతూ.. ఒక వ్యక్తి మృతిచెందినట్లు- వైద్యులు వెల్లడించారు. ఉప్పల్ రామంతపూర్ గోకులే నగర్లో జరిగిన దుర్ఘటన గురించి విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా జరిగిన ఊరేగింపులో విద్యుత్ షాక్‌తో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని తెలిపారు. ఈ విషాదంలో కృష్ణ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, సురేష్ యాదవ్, రుద్ర వికాస్, రాజేంద్ర రెడ్డిలు మరణించడం హృదయ విదారకం ఘటన అని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు- ప్రకటించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు- చెప్పుకొచ్చారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాని అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు- చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేటీ-ఆర్ సూచించారు. రామంతాపూర్ గోకులే నగర్లో వైభవంగా సాగుతోన్న శ్రీకృష్ణుడి శోభాయాత్రలో విద్యుత్ షాక్‌తో ఐదుగురు భక్తులు మృతి చెందడం అత్యంత విషాదకరమని ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సాన-ుభూతి తెలియజేస్తున్నట్లు- ఆమె ప్రకటించారు. ప్రమాదంపై ప్రభుత్వం దర్యాప్తు జరిపించి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి కుటు-ంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని పేర్కొన్నారు. గాయపడిన నలుగురికి మెరుగైన చికిత్స అందించాలని కవిత సూచించారు.

## కోటిమందికి ఏఐ ఆధారిత పౌరసేవలు

### 2027 నాటికి సాకారమయ్యేలా కృషి

### ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**హైదరాబాద్, ఆగస్ట్ 18 :** 2027 నాటికి ఏఐ ఆధారిత పౌర సేవలను కోటి మంది ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ-, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'ఏఐ - లెడ్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ - ఛాంపియన్స్కాటలిస్ట్స్ ప్రోగ్రామ్' పేరిట ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్(ఐటీ- శాఖ) ఆధ్వర్యంలో ప్రభుత్వాధి కారులకు జూబ్లీహిల్స్ లోని డా. ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్స్టిట్యూట్ లో మూడ్రోజుల పాటు- నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తమది సమస్య వచ్చిన తర్వాత స్పందించే ప్రభుత్వం కాదన్నారు. ముందుగానే ఊహించి పరిష్కరించే చురుకైన, పారదర్శకమైన, ముందుచూపున్న ప్రభుత్వమన్నారు. ఏఐ సహకారంతో ప్రజలు అడగకుండానే వారి ముంగిటకు పౌర సేవలను చేర్చే సరికొత్త తెలంగాణను నిర్మించాలన్నదే తమ సంకల్పమన్నారు. ఈ కొత్త తెలంగాణ 5 బిలియన్ డాలర్ల ఏఐ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా మారుతుందని, వేలాది ఉద్యోగాలను సృష్టిస్తుందని వివరించారు. 'ఏఐ క్యాపిటల్ ఆఫ్ ది గ్లోబ్ గా తెలంగాణ'ను తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ సిటీ-, ఏఐ యూనివర్సిటీ-, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ ను అందుబాటు-లోకి తేబోతున్నామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ ఛేంజ్ ను ప్రార ంభించి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలిచామన్నారు. ఇదే స్ఫూర్తితో 20 ప్రభుత్వ శాఖలకు చెందిన 300 రకాల పౌర సేవలను ఏఐ ఆధారిత అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం ఆయా శాఖల నుంచి 250 మంది అధికారులను ఎంపిక చేసి... ఏఐ వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వీరికి మూడు నెలల పాటు- ఏఐ నిపుణులు మెంటార్లుగా వ్యవహరించి మార్గదర్శకత్వం చేస్తారని వివరించారు. కార్యక్రమ ంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, డిప్యూటీ- సెక్రెటరీ భవేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## ఓబులాపురం మైనింగ్ కేసు

### మరోమారు సబితకు హైకోర్టు నోటీసులు



**హైదరాబాద్, ఆగస్ట్ 18 :** మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ కృపానందానికి తెలంగాణ హైకోర్టు నోటీ-సులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో వీరిద్దరిని నిర్దోషులుగా తేల్చుతూ నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. ఈక్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ఉన్నత న్యాయస్థానం సబితా ఇంద్రారెడ్డి, కృపానందాన్ని ఆదేశించింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మే నెలలో తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు- సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు- జైలు శిక్ష ఖరారు చేసింది. అలాగే, దోషులకు రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ.2 లక్షలు జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతో పాటు- అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. మరోవైపు ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నలుగురు దోషులకు తెలంగాణ హైకోర్టు ఇటీ-వల బెయిల్ మంజూరు చేసింది. గాలి జనార్దనరెడ్డితో పాటు , ఆయన పీఏ అలీఖాన్, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్‌కు బెయిల్ ఇచ్చింది.

## రామంతపూర్ ఘటనపై భట్టి దిగ్భ్రాంతి

### తీవ్రంగా కలచివేసిందని ప్రకటన

**హైదరాబాద్, ఆగస్ట్ 18 :** ఉప్పల్ పీఎస్ పరిధిలోని రామంతపూర్ గోకులే నగర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి శోభాయాత్ర సందర్భంగా జరిగిన దుర్ఘటనపై డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనకు గల కారణాలపై సిఎండి ముషారఫ్ ఫారుకి ద్వారా ఆరా తీశారు. ఈ ప్రమాదంలో అయిదుగురు మరణించడం, మరికొంత మంది గాయపడటం దురదృష్టకరమన్నారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని సూచించారు.

## యూరియా కోటా కోసం కాంగ్రెస్ ఎంపిల ఆందోళన

### బిజెపికి 8మంది ఎంపిలున్నా లాభం లేదన్న మల్లు రవి

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 18 :** రాష్ట్రానికి ఇవ్వాల్సిన 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇవ్వాలంటూ పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలందరు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం వెంటనే యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నిసార్లు కోరినప్పటికీ కేంద్రం జాప్యం చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. రైతులు ఇప్పటికే పెద్ద ఎత్తున్న ఆందోళన చేస్తున్నారని.. రాష్ట్ర సమస్యను లేవనెత్తాలనుకున్నప్పుడల్లా పార్లమెంట్ వరుసగా వాయిదా వేస్తూ వచ్చారని తెలిపారు. 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి రాష్ట్రం కోసం ఏం చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం కేంద్ర ఎరువుల రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డా అపాయిం-టె-÷-మంట్ కోరినట్లు వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఫెర్టిలైజర్స్ స్టాండింగ్ కమిటీలో యూరియా విడుదల చేయాలని కోరుతామని ఎంపీ మల్లు రవి అన్నారు. అపాయింటెమంట్ ఇవ్వకపోతే నడ్డా కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సైతం కేంద్రమంత్రి నడ్డాకు ఇచ్చే లేఖను అందజేస్తామని పేర్కొన్నారు. రామగుండంలో ఫెర్టిలైజర్ కంపెనీ ఉంటే ఢిల్లీ నోయిడాలో కూర్చొని అధికారులు విధులు నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ తెలిపారు.

# పార్లమెంట్‌లో ఎన్నికల సంస్కరణలపై చర్చించాలి!



బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వ్యవహారం రచ్చ కొనసాగుతోంది. నిజంగానే ఇందులో లోపాలు ఉంటే పరిశీలించి, పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉంది. అందుకు బీహార్ ఎన్నికల సంఘం వెంటనే కార్యాచరణకు దిగాల్సి ఉంది. ఎందుకంటే దేశంలో ఇన్నేళ్లయినా సమగ్ర ఓటు విధానం లేకుండా పోయింది. రాజకీయ నాయకులు ప్రమేయంతో మార్పులు, చేర్పులు చేయడం అలవాటయ్యింది. వ్యవస్థీకృత లోపాలకు ఇన్నేళ్లు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీది ప్రధాన బాధ్యత. అలాగే దానిని కొనసాగిస్తున్న బిజెపిది కూడా. ఈ రెండు పార్టీల పాలనలో కేంద్ర ఎన్నికల సంఘం సర్వస్వతంత్రంగా పని చేయకుండా దమ్మీ పాత్రను పోషించేలా తయారయ్యింది. అలాగే గత పదేళ్లుగా అధికారం చెలాయిస్తున్న మోడీ కూడా ఎన్నికల సంఘాన్ని పటిష్టం చేయకుండా, మరింతగా దిగజారేలా చేస్తూ వచ్చారు. నిజానికి ఓటరు కార్డును పక్కాగా, పకడ్బందీగా రూపొందించడం పెద్ద పనికాదు. ఆధార్, పాన్ కార్డు తరహాలో పక్కాగా ఓటరు కార్డును రూపొందించవచ్చు. కానీ ఎన్నికల సంఘం ఈ తరహా ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే ఎన్నికల సంఘం తీరుపై కారాలు మిరియాలు నూరుతున్న రాహుల్ ఎందుకు ఎన్నికల సంస్కరణల పై మాట్లాడడం లేదు. ఎందుకు నిజాయితీగా వ్యవహరించడం లేదు. ఎందుకు పార్లమెంటులో చర్చకు దిగడం లేదు. కేవలం బీహార్ విషయమే గాకుండా మొత్తం ఎన్నికల సంస్కరణలపై మాట్లాడడం ద్వారా, విపక్షనేతగా తన సత్తా చాటుకోవాలి. అలా కాకుండా బీహార్ జాబితాను ముందేసుకుని మాట్లాడితే, ఆ రాష్ట్ర ఎన్నికలు ముగిసాక సమస్య మళ్లీ మొదటికే వస్తుంది. ఎన్నికల జాబితాలో ఎప్పుడు పడితే అప్పుడు ఇష్టం వచ్చినట్లు మార్పులు చేయడం, ఒకే ఇంటినూ వందల సంఖ్యలో ఓట్లు ఉండడం, ఒకే ఇంట్లో ఉన్నవారికి వేర్వేరు పోలింగ్ బూతుల్లో ఓటు కల్పించడం చూస్తున్నాం. నిజానికి దొంగ ఓట్ల సమస్య కూడా ఉంది. దొంగ ఓట్లు వేస్తే ఉరిశిక్ష విధించాలి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు అర్హత కోల్పోయేలా చేయాలి. తెలంగానలో పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల విషయంలో సుప్రీం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, ఈ విషయంలో రాహుల్ ఎందుకు మాట్లాడడం లేదో చెప్పాలి. అందుకే ఎన్నికల సంస్కరణలపై రాహుల్ ముందు మాట్లాడాలి. ప్రతిపక్షనేతగా బాధ్యత తీసుకోవాలి.

మోడీ సర్కార్‌ను నిలదీయడం కాదు. దేశ భవిష్యత్ కోసం బాధ్యతగల ప్రతిపక్ష నేతగా మాట్లాడాలి. పటిష్టమైన ఎన్నికల విధానం అమలు కావాలంటే సంస్కరణలు రావాలి. ఇందులో ఉన్న లోటుపాట్లకు సంబంధించి అన్ని విషయాల్లో చర్చ జరగాలి. ఈ పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరిగేలా రాహుల్ బాధ్యత తీసుకోవాలి. ఈ పని ఇన్నేళ్లుగా ఎందుకు చేయడం లేదన్నది గమనించాలి. ఇకపోతే ఒక్క శేషన్ కాలంలోనే ఎన్నికల సంఘం గట్టిగా పనిచేసింది. బీహార్ జాబితా వ్యవహారపై సవాల్ చేసిన పిటిషన్లపై విచారణలో భాగంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం భారత ఎన్నికల సంఘం రెండు ముఖ్యమైన ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్ల జాబితాను, తీసివేతకు కారణాలతో సహా ప్రచురించాలని తెలిపింది. ఆధార్ కార్డును ఒక ధ్రువీకరణ పత్రంగా అంగీకరించాలని కూడా పేర్కొంది. 'సర్'ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఇంకా కొనసాగు తోంది. అయితే 'సర్'కు సంబంధించి, న్యాయసమీక్ష పరిధిలోకి రాని, అంశాలు అనేకం ఉన్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ లాంటి కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా నిర్వహించలేదు. జననమరణాలు సహజం. చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం సమర్థనీయమే. డబుల్ ఓట్లు ఉన్నా, పలు నియోజకవర్గాల్లో ఓటు ఉన్నా తొలగించాల్సిందే. అందుకు ప్రజలను కూడా బధ్యులు చేయాలి. అలాగే 18 సంవత్సరాల నిండిన యువతీ యువకుల పేర్లను ఓటర్ల జాబితాలో విధిగా చేర్చడం కూడా ముఖ్యమే. ఇకపోతే బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ తొలిదశను కేవలం 30 రోజులలో ఎందుకు పూర్తి చేశారన్న అనుమానాలు ఉన్నాయి. ప్రత్యేక సవరణలో 64 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితాను తొలగించినట్టు ఈసీఐ వెల్లడించింది. వీరిలో 22 లక్షల మంది 'మరణించి నట్టు', 7 లక్షల మంది పలు ప్రదేశాలలో ఓటర్లుగా నమోదు చేయించు కున్నారని, 36 లక్షల మంది బిహార్ నుంచి శాశ్వతంగా వలస పోయినవారు లేదా ఎటువంటి జాడ తెలియనివారు అని ఈసీఐ పేర్కొంది. నిజంగానే ఇది నిజమైతే సుప్రీం ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం వివరాలు ప్రకటించాలి. 36 లక్షల మంది బిహారీలు 'శాశ్వతంగా వేరే ప్రదేశాలకు వెళ్లిపోయారని' లేదా 'జాడ తెలియనివారు' అన్న నిర్ణయానికి ఎన్నికల సంఘం నిర్ణయించడానికి గల ఆధారాలు ఇవ్వాలి. కానీ ప్రస్తుత సవరణ తరవాత తాము ఓటు హక్కు కోల్పోతామేమోనని బిహార్‌లో లక్షలాది ఓటర్లు భయపడుతున్నారు.

ఈ ఏడాది చివరలో జరగనున్న శాసనసభ ఎన్నికలలో తాము ఓటేసేందుకు లేకుండా పోయిందన్న భయంలో ఉన్నారు. నిజానికి ఇలాంటి చిన్నిచిన్న సమస్యలను కూడా పట్టించుకోకుండా ఎన్నికల సంఘం తన పనితీరును కొనసాగించడం సరికాదు. అందుకే ఎన్నికల సంఘం చట్టబద్ధమైన సంస్థగా వ్యవహరించడం లేదన్న విమర్శలు తరచూ వస్తున్నాయి. ఎవరికో ఒకరికి వత్తాసు పలికేందుకు ఎన్నికల సంఘం పనిచేయరాదు. జవాబుదారీ తనం ముఖ్యం. తాను రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థనని గుర్తించాల్సిందే. అలాగే తప్పులు జరిగినప్పుడు ఎన్నికలతో ప్రమేయమున్న ఓటర్లు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు జవాబుదారీగా కూడా ఉండాలి. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీలు ఆరోపణలు చేసి, పార్లమెంట్‌ను బహిష్కరించడం సరికాదు. కేవలం వాయిదా తీర్మానంలోనే చర్చించాలన్న మూర్ఖపు వాదనా సరి కాదు. బీహార్‌తో పాటు మొత్తం ఎన్నికల సంస్కరణలపైనే పెద్ద చర్చ జరగాల్సి ఉంది. దీనికి రాహుల లేదా ఇండియా కూటమి నేతలు సిద్ధం కావాలి. పార్లమెంటులో చర్చించడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. వాటి ద్వారా చర్చకు వెళ్లాలి. పార్లమెంట్ బహిష్కరణలు, ర్యాలీలు, విమర్శలు, ధర్నాలు,పాదయాత్రలు వంటివన్నీ పాతపద్ధతులు. ఇవన్నీ కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశించినవి మాత్రమే. పార్లమెంటులో చర్చ ద్వారా రాజ్యాంగ సవరణకు పూనుకోవాలి. మోడీ ప్రభుత్వంతప్పిదాలు ఉంటే నిలదీయండి. అలాగే గతంలో తమ పాలనకాలంలో జరిగిన తప్పులంటే క్షమాపణలు కోరండి.

## కాళేశ్వరంలో నీళ్లు లేకున్నా..

# గోదావరి బేసిన్ ప్రాజెక్టుల్లో జలకళ

### తెలంగాణ ప్రభుత్వం



**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు లేకున్నా.. మేడిగడ్డ ఆనకట్ట కుంగినా, అన్నారం, సుందిళ్లలో నీటిని ఆపకున్నా వర్షాలతో గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ జలకళ సంతరిం చుకున్నాయని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిండటంతో ఉత్తర తెలంగాణలో వరద కాల్వలతోపాటు మిడ్ మానేరు, ఎల్ఎండీలో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతున్నాయని తెలిపింది. మహారాష్ట్ర, ఎగువన గోదావరి పరివాహకంలో కురిసిన వర్షాలతో ఎస్సారెస్పీకి మూడు రోజులుగా ఇన్ ఫ్లో కొనసాగుతోంది. సోమవారం మధ్యాహ్నం లక్షా 25వేల క్యూసెక్కులకు పైగా ఇన్ ఫ్లో ఉండగా.. ఔట్ ఫ్లో 76,867 క్యూసెక్కులకు పైగా ఉంది. కాకతీయ కాల్వకు 5,000 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 18 వేల క్యూసెక్కుల నీటిని ఇందిరమ్మ వరద కాల్వ ద్వారా మిడ్ మానేరుకు వదులుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వ 18.92 టీఎంసీలకు చేరుకొంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు. ఎల్లంపల్లి గరిష్ఠ నీటిమట్టం 148 మీటర్లు కాగా.. ప్రస్తుతం 147.55 మీటర్ల వద్ద నీటిమట్టం ఉంది. ఎస్సారెస్పీ పరివాహకంలో కురిసిన వర్షాలతో 48,293 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ తాగునీటితో పాటు ఎన్టీపీసీకి నీటిని విడుదల చేస్తున్నారు. నంది పంప్ హౌస్‌కు 6,300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆగస్ట్ 13 నుంచి అయిదు రోజులుగా ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు 4.12 టీఎంసీల నీటిని వదిలారు. మిడ్ మానేరు జలాశయంలో 10. 81 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుత నీటి మట్టం 309.63 మీటర్లు ఉండగా.. అది 311.14 మీటర్లకు చేరితే నీటినిల్వ 13.13 టీఎంసీలకు చేరుతుంది. అప్పుడు ఒక పంప్ ఆన్ చేయటం వీలవుతుందని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం ఉన్న ఇన్ ఫ్లో ప్రకారం ఆగస్ట్ 20వ తేదీ నుంచి పంపింగ్ ప్రారంభించే అవకాశాలున్నాయని నీటి పారుదల శాఖ ఇంజినీర్లు తెలిపారు. మిడ్ మానేరు నుంచి నాలుగు పంపులు రన్ చేయాలంటే నీటినిల్వ 25.77 టీఎంసీలకు చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# సైలెంట్‌గా వాహన లైఫ్‌టాక్స్ పెంపు

**జీఓ 53 విడుదల.. 14 నుంచే పెంచిన టాక్స్ అమలు**




**హైదరాబాద్, ఆగస్ట్ 18 :** తెలంగాణ ప్రభుత్వం వాహనాలపై లైఫ్‌టాక్స్ పెంచింది. ఆగస్టు 14 నుంచి కొత్త రేట్లు- అమల్లోకి వచ్చాయి. రవాణా, రోడ్లుభవనాల శాఖ జారీ చేసిన జీఓ నెం.53 ద్వారా మోటార్ వాహనాల పన్ను చట్టం, 1963లోని షెడ్యూల్స్‌లో మార్పులు చేసింది. ఈ మేరకు రెండు, మూడు, నాలుగు చక్రాల నాన్-ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు పెరిగిన లైఫ్‌టాక్స్ వసూలు చేయనుంది. తాజా నిర్ణయం ప్రకారం, రూ.50 వేలు లోపు ధర కలిగిన రెండు చక్రాల వాహనాలపై ఇప్పుడు 9 శాతం పన్ను విధించనున్నారు. రూ.50 వేలు నుంచి ఒక లక్ష వరకు ఉన్న బైకులపై 12 శాతం పన్ను యథాతథంగా కొనసాగుతుంది. ఒక లక్ష నుంచి రెండు లక్షల మధ్యలో ఉన్న వాహనాలపై 15 శాతం, రెండు లక్షలకు పైబడిన వాటిపై 18 శాతం లైఫ్‌టాక్స్ వసూలు చేస్తారు. ఉదాహరణకు రూ.1.10 లక్షల బైక్ కొంటే ఇంతకుముందు రూ.13,200 పన్ను ఉండగా, ఇప్పుడు అది రూ.16,500కి పెరిగింది. నాన్-ట్రాన్స్‌పోర్ట్ నాలుగు చక్రాల వాహనాలపై కూడా ప్రభుత్వం భారీగా పన్ను పెంచింది. ఐదు లక్షలలోపు ధర కలిగిన కార్లపై 13 శాతం, పది నుంచి ఇరవై లక్షల మధ్య కార్లపై 18 శాతం, ఇరవై నుంచి యాభై లక్షల మధ్య వాహనాలపై 20 శాతం, యాభై లక్షలకు పైబడిన లగ్జరీ కార్లపై 21 శాతం లైఫ్‌టాక్స్ అమల్లోకి తెచ్చారు. అదనంగా కంపెనీల పేరుతో కొనుగోలు చేసే వాహనాలు, రెండో వాహనాలపై మరింత ఎక్కువ పన్ను విధించనున్నారు. కొన్ని కేటగిరీలలో ఇది 25 శాతం వరకు ఉండొచ్చు. అయితే విద్యుత్ వాహనాలకు మినహాయింపు ఇచ్చి వాటిపై ఎలాంటి లైఫ్‌టాక్స్ వసూలు చేయరని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ రాయితీ 2026 డిసెంబర్ 31 వరకు కొనసాగనుంది. ఈ పెంపుతో ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.4,350 కోట్ల ఆదాయాన్ని లైఫ్‌టాక్స్ రూపంలో సమీకరించనుందని అంచనా. కానీ ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. పేద, మధ్యతరగతి వర్గాలపై ఇది మరింత భారమని, చిన్న వ్యాపారులు, రైతులు నష్టపోతారని ఆయన వ్యాఖ్యానించారు. కార్లపై అదనంగా 20 నుంచి 25 వేల రూపాయల వరకు భారం పడుతుందని ఆయన ఉదహరించారు. ఇక ఆటోమొబైల్ రంగం ప్రతినిధులు కూడా ఈ పెంపు పండుగ సీజన్ సేల్స్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## సెప్టెంబర్ 24 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**తిరుమల, ఆగస్ట్ 18 :** తిరుమలలో ఈ ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2 వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో టీటీడీ ఈవో జె. శ్యామలారావు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. వివిధ ఏర్పాట్లను సమీక్షించారు. సమీక్షలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధన్ రాజులతో పాటు టీటీడీ జేఈవో శ్రీ వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీ మురళీకృష్ణలతో కలిసి సోమవారం సాయంత్రం అన్నమయ్య భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 24న బ్రహ్మోత్సవాల తొలిరోజు పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## శ్రీవారి దర్శనం పేరుతో టోకరా

**ఇద్దరిని పట్టుకున్న టిటిడి అధికారులు**

**తిరుమల, ఆగస్ట్ 18 :** కలియుగ దైవం తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఇదే అదునుగా భావించిన కొందరు దళారులు మోసాలకు పాల్పడుతున్నారు. సోషియల్ మీడియా వేదికగా భక్తులను మోసగిస్తున్నారు దళారులు. శ్రీవారి భక్తులను దర్శనాల పేరుతో మోసం చేస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ కి చెందిన భక్తుడి వద్ద దర్శనాల పేరుతో రూ. 90 వేలు వసూలు చేసినట్లు- గుర్తించారు. భక్తుడు దళారుపై టిటిడి విజిలెన్స్‌కి పిర్యాదు చేయడంతో మోసం వెలుగుచూసింది. దళారులు శర్మ, నటరాజ్‌లపై ఇప్పటికే 12 కేసులు నమోదైనట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.. టిటిడి అధికారిక వెబ్ సైట్ ద్వారానే టిక్కెట్లు పొందాలని టిటిడి సూచిస్తోంది.

# యూరియా కొరతపై కాంగ్రెస్ వాయిదా తీర్మానం

**కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 18 :** దేశవ్యాప్తంగా మరోమారు యూరియా కొరతల ఆందోళన కనిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. రైతుల క్యూలో నిలబడి యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. అయితే రాష్ట్రంలో గత కొన్ని నెలలుగా యూరియా కొరత తీవ్ర దుమారం రేపుతుంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు వివక్షత చూపిస్తూ.. యూరియా ఇవ్వడం లేదని అధికార పార్టీ నేతలు ఆరోపిస్తుంటే.. అధికారంలో ఉన్న నేతలు యూరియాను బ్లాక్‌లో అమ్ముకున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నాయి. ఏది ఎలా పోయినా.. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నది వాస్తవం. అది రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యమో, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమో తెలియక రైతులు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతపై పార్లమెంటు-లో తెలంగాణ కాంగ్రెస్ ఏంపీలు వాయిదా తీర్మానం ఇచ్చారు. వాయిదా తీర్మాన ప్రతిపాదనను లోకసభ సెక్రటరీ జనరల్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పంపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు తెలంగాణ రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు యూరియాను కేంద్రం కేటాయించిందని తెలిపారు. కానీ ఇప్పటి వరకు కేవలం 4.50 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా మాత్రమే సరఫరా చేసిందని చెప్పారు. ఆగస్టు 13వ తేదీ వరకు ఇంకా 6.60 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉందని చామల పేర్కొన్నారు. ఇందువల్ల రాష్ట్రంలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కొరత ఏర్పడినట్లు- ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పంటలకు అవసరమైన యూరియా దొరకక రైతుల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నట్లు- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరత ఏర్పడి రాష్ట్రంలో తీవ్ర గందరగోళ పరిస్థితులకు దారితీసినట్లు- వెల్లడించారు. జూన్‌లో రావాల్సిన నైరుతి రుతుపవణాలు ముందుగానే ఈ ఏడాది మే 26న రాష్ట్రానికి వచ్చాయని, దాని వల్ల పంటలు వేయడం మొదలుపెట్టిన రైతులకు సకాలంలో యూరియా అందకపోవడంతో ఆ ప్రభావం పంటలపై తీవ్రంగా పడుతోందని వివరించారు. రాష్ట్రంలో ఉత్పన్నమైన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని యూరియా కొరత అంశాన్ని లేవనెత్తేందుకు తనకు అనుమతి ఇవ్వాలని చామల కిరణ్ కుమార్ కోరారు. ఈ యూరియా కొరత రైతన్నల వర్షాకాల పంట కలలను చిదిమేయకముందే పరిష్కారం అవుతుందని ఆశిద్దాం.



## బాలిక దారుణహత్య

**హైదరాబాద్:** నగరంలో పదేళ్ల బాలిక దారుణహత్యకు గురైంది. కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగీత్ నగర్‌లో కుమారుడు, కుమార్తెతో కలిసి దంపతులు నివాసముంటున్నారు. తండ్రి బైక్ మెకానిక్.. తల్లి ల్యాబ్ టెక్నీషియన్. బాలిక కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం తల్లిదండ్రులు తమ కుమారుడిని స్కూల్‌కు పంపి విధులకు వెళ్లారు. కుమార్తెకు స్కూల్ సెలవు కావడంతో ఇంట్లోనే ఒంటరిగా ఉంది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కుమారుడి లంచ్ బాక్స్ తీసుకెళ్లేందుకు తండ్రి ఇంటికి వచ్చాడు. బెడ్‌రూమ్‌లో పొట్టపై కత్తి పోట్లతో బాలిక విగతజీవిగా పడి ఉండటాన్ని ఆయన గుర్తించాడు. తన కుమార్తెను దుండగుడు హతమార్చినట్లు అనుమానిస్తూ కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కూకట్‌పల్లి పోలీసులతో పాటు బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్‌తో ఆధారాలను సేకరించారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సూరత్‌లో రూ. 25 కోట్ల విలువైన డైమండ్స్ చోరీ

గుజరాత్‌లో భారీ వజ్రాల చోరీ చోటుచేసుకుంది. దాదాపు రూ.25 కోట్లు విలువ చేసే వజ్రాలను దోచుకున్నారు. సూరత్‌లోని డీకే అండ్ సన్స్ డైమండ్ కంపెనీలో ఈ ఘటన జరిగింది. కంపెనీలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వజ్రాలను చోరీ చేసినట్లు పోలీసులు సోమవారం వెల్లడించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం .. నగరంలోని కపోద్రా ప్రాంతంలో డీకే అండ్ సన్స్ డైమండ్ కంపెనీ ఆఫీస్ కమ్ పాలిషింగ్ యూనిట్‌లో ఆగస్టు 15 నుంచి 17 మధ్య ఈ సంఘటన జరిగింది. ఆ సమయంలో సీసీటీవీ కెమెరాలు కూడా ధ్వంసం కావడం గమనార్హం. కంపెనీకి వరుసగా మూడురోజులు సెలవులు ప్రకటించడంతో ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది లేని సమయంలో ఈ వజ్రాల చోరీ జరిగినట్లు కంపెనీ పేర్కొంది. దీన్ని అవకాశంగా తీసుకున్న దుండగులు మొదటగా కంపెనీ కింది ఫ్లోర్‌లోని ప్రధాన డోర్‌ను బద్దలు కొట్టి ఆ తర్వాత మెటల్ సేఫ్ ఉంచిన మూడో ఫ్లోర్‌కి వెళ్లారు. అనంతరం గ్యాస్ కట్టర్‌తో సేఫ్‌ను కత్తిరించారు. కంపెనీ యూనిట్ యజమాని సెలవుల అనంతరం సోమవారం కార్యాలయాని కి వెళ్లగా ఈ విషయం తెలిసిందని చెప్పారు. ప్రాథమిక దర్యాప్తు లో దాదాపు రూ.25 కోట్లు విలువ చేసే వజ్రాలను దోచు కున్నట్లు అంచనా వేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అలోక్ కుమార్ తెలిపారు.

## విజయవాడ రహదారిపై ట్రాఫిక్ జామ్

**హైదరాబాద్, ఆగస్ట్ 18 :** విజయవాడ-హైదరాబాద్ నేషనల్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. వీకెండ్ ముగియడంతో ప్రజలు తిరిగి పట్నం బాట పట్టారు. ఈ క్రమంలో ఏపీ నుంచి వేల సంఖ్యలో వాహనాలు హైదరాబాద్ వైపు వస్తుండడంతో విజయవాడ- హైదరాబాద్ హైవేపై, టోల్ వద్ద వాహనాల రద్దీ పెరిగింది. చిట్యాల మండలం పెద్దకాపర్తి దగ్గర ఫ్లైఓవర్ పనులు జరుగుతుండటంతో పెద్దకాపర్తి నుంచి చిట్యాల వరకు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో టోల్ వద్ద మరిన్నీ బూత్‌లను ఓపెన్ చేశారు. హైవే పై భారీగా వాహనాల రద్దీ నెలకొనడంతో ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇందులోనే వర్షం కురుస్తుండటంతో వారి తిప్పలు మరింత ఎక్కువయ్యాయి.



## ప్రీ ప్రైమరీ, పిఎం శ్రీ విద్యను అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించాలి

### సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** అంగన్వాడి టీచర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు చేవెళ్ల అంగన్వాడి ప్రాజెక్ట్ టీచర్లు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ... ఐసిడిఎస్ ను రక్షించాలని, పేద ప్రజలకు సేవలు అందిస్తున్న అంగన్వాడీ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ విద్యను ఐసిడిఎస్ అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించాలని, ప్రీ ప్రైమరీ స్కూళ్లలో విద్యాబోధన బాధ్యతను అంగన్వాడి టీచర్లకు అప్పగించాలని, విద్యా వాలంటీర్లకు కేటాయించిన వేతనం అదనంగా అంగన్వాడి టీచర్లకు హెల్పర్లకు ఇవ్వాలని, ఆరు సంవత్సరాలోపు పిల్లలు ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ చేసుకోకుండా నిబంధన అమలు చేయాలి డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ కు సంబంధంలేని బి ఎల్ ఓ డ్యూటీ, ఇతర పనులు అంగన్వాడి టీచర్లతో చేయించరాదని, ఖాళీగా ఉన్న అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, తదితర అంగన్వాడి టీచర్ల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యురాలు ఉమారాణి, స్వప్న, ప్రవీణ, సుజాత, సెక్టార్ లీడర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

- సర్వాయి పాపన్న బహుజన రాజ్యాధికార పోరాటానికి ప్రతీక
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి
- ప్రథమ బహుజన వీరుడిగా చరిత్రలో నిలిచిన పాపన్న
- సేవా ఫౌండేషన్ అధ్యక్షులు నరేష్ కుమార్

**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సోమవారం శంకర్ పల్లి ప్రధాన చౌరస్తాలో బిజెపి నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి మాట్లాడుతూ....సర్దార్ పాపన్న తెలంగాణ తొలిరాజు, బహుజన రాజ్యాధికారానికై పోరాటం చేసిన పరాక్రమవంతుడుని కొనియాడారు. కులవ్యవస్థ, భూస్వామ్య దోపిడిపై గర్జించిన వీరుడు. మొఘల్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గెరిల్లా వ్యూహాలతో పోరాడి బహుజన గౌరవాన్ని నిలబెట్టిన ధీరుడు" అని కొనియాడారు. సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేష్ కుమార్ మాట్లాడుతూ....సర్దార్ సర్వాయి పాపన్న మొట్టమొదటి బహుజన వీరుడు. వర్గ–జాత్య భేదాలను అధిగమించి బహుజన సంక్షేమానికి మార్గం చూపిన యోధుడు" అని అన్నారు. అనంతరం నరేష్ కుమార్, తన కుమారుడు శ్రీనిశాంత్ సంయుక్తంగా రచించిన 'సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్ర' పుస్తకాన్ని కార్యక్రమంలో పాల్గొన్న వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కో–కన్వీనర్ మధు మోహన్ రెడ్డి గుండ్ర, శంకర్ పల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిసోల్ల వెంకటేశ్, మాజీ అధ్యక్షులు బీర్ల సురేష్, మాజీ ప్రధాన కార్యదర్శులు ఎర్రోళ్ల రాజ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు జయరాం రెడ్డి, చేకూర్త కృష్ణ రెడ్డి, నరేగూడెం నరసింహ రెడ్డి, ఏనుగు నరసింహ రెడ్డి, అనిశెట్టి సురేష్‌తో పాటు సేవా ఫౌండేషన్ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

**వలిగొండ, రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని దాసిరెడ్డిగూడెం గ్రామంలో సోమవారం రోజున బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గోల్కొండ కోటను ఏలిన మొదటి బహుజన రాజుగా చరిత్రలోకి ఎక్కిన మహావీరుడు ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని వారన్నారు. ఈ కార్యక్రమంలో బాలగోని బిక్షపతి గౌడ్(పెద్ద గౌడ్ ) గౌడ సంఘం అధ్యక్షుడు బొడిగె ఐలయ్య గౌడ్, బందారపు లింగస్వామిగౌడ్, బాలగోని మల్లయ్య గౌడ్, దంతూరి శంకరయ్య, బొడిగె యాదయ్య గౌడ్, గోద అచ్చయ్యగౌడ్, బాలగోని లక్ష్మీనారాయణ గౌడ్, కాటం గణేష్ గౌడ్, దంతూరి పరమేష్ గౌడ్, బాలగోని సంతోష్ గౌడ్, బాలగోని శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కురుమ గొల్ల కులదైవం బీరప్పకు బోనాలు

**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కురుమ గొల్లలు వారి కుల దైవం బీరప్ప స్వామికి బోనాలు సమర్పించారు. కురుమ గొల్ల మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి రంగు రంగుల తో బోనాలను అలంకరించి బోనం ఎత్తుకొని ఊరేగింపుగా పురవీధుల గుండా తిరుగుతూ ఒగ్గు కళాకారుల డోలు వాయిద్యాలు నృత్యాలతో, శివసత్తుల పూనకాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపుగా బయలుదేరి స్థానిక బీరప్ప స్వామి గుడి వరకు వెళ్లి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో కుల పెద్దలు కులస్తులు మహిళలు పాల్గొన్నారు.

# 'ప్రెస్ సేవా పోర్టల్'పై అవగాహన పెంపొందించుకోవాలి

- పిఆర్‌జిఐ డైరెక్టర్ జనరల్ యోగేష్ కుమార్ బవేజా
- కవాడిగూడ సీజీవో టవర్స్ పిఐబి ఆడిటోరియంలో ప్రచురణకర్తలకు ప్రెస్ సేవా పోర్టల్ వాడకంపై దిశా నిర్దేశం
- పారదర్శకత, వేగవంతమైన అనుమతులకు "సింగిల్ విండో సొల్యూషన్"గా ప్రెస్ సేవా పోర్టల్
- ప్రచురణకర్తల సమస్యలపై పీఐబి హైదరాబాద్ ఆధ్వర్యంలో 'వార్తలాప్' వర్క్‌షాప్ నిర్వహణ
- హాజరైన డిప్యూటీ ప్రెస్ రిజిస్ట్రార్ అశుతోష్ మొహ్లే, పి ఐ బి హైదరాబాద్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్, ఎన్‌ఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రెస్ సేవా పోర్టల్ గౌరవ్ శర్మ, పీఐబి అధికారులు డాక్టర్ మానస్ కృష్ణ, గాయత్రి, శివ చరణ్ రెడ్డి
- ఏజెంట్లను నమ్మి ప్రచురణ కర్తలు మోసపోవద్దు





**హైదరాబాద్, ఆగస్టు 18, రాజముద్ర న్యూస్ :** సమాచార ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబి), హైదరాబాద్ ఆధ్వర్యంలో సీజీఓ టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్‌లో ప్రచురణకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై 'వార్తలాప్' పేరుతో ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌జీఐ) యోగేష్ బవేజా మాట్లాడుతూ... ప్రెస్ సేవా పోర్టల్‌ను సింగిల్ విండో సొల్యూషన్‌గా ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం అవుతుందని, పారదర్శకత పెరుగుతుందని, అనుమతులు వేగవంతం అవుతాయని, ప్రచురణకర్తలకు మరింత సౌలభ్యం లభిస్తుందని వివరించారు. శృతి పాటిల్, పీఐబి హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ... తెలంగాణలో తొలిసారి ఇలాంటి ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించామని, ఇది ప్రచురణకర్తలకు తమ సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కల్పిస్తుందని తెలిపారు. పీఆర్‌జీఐ సహకారంతో, త్వరలో ప్రచురణకర్తల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్టు ఆమె వెల్లడించారు. అశుతోష్ మొహ్లే, డిప్యూటీ ప్రెస్ రిజిస్ట్రార్ కొత్త చట్టంపై ప్రజెంటేషన్ ద్వారా ప్రచురణకర్తలకు అవగాహన కల్పించారు. 2024 మార్చి నుంచి రిజిస్ట్రేషన్ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతోందని, 60 రోజుల్లోగా స్పందన రాకపోతే దరఖాస్తులు డీమ్డ్ అప్రూవ్ గా పరిగణించబడతాయని ఆయన తెలిపారు. ప్రచురణకర్తలు ఏజెంట్ల సహాయం తీసుకోకుండా నేరుగా పీఆర్‌జీఐ పోర్టల్ వాడాలని ఆయన సూచించారు. గౌరవ్ శర్మ, ఎన్‌ఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రెస్ సేవా పోర్టల్ గురించి లైవ్ డెమో ద్వారా వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రచురణకర్తలు ఈ వర్క్ షాప్ లో చురుకుగా పాల్గొని, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఐబి అధికారులు డాక్టర్ మానస్ కృష్ణ కాంత్, డిప్యూటీ డైరెక్టర్, మీడియా అండ్ కమ్యూనికేషన్ ఆఫీసర్లు గాయత్రి, శివచరణ్ రెడ్డి, అలాగే ఐఅండ్‌పీఆర్ అధికారులు, తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన ప్రచురణకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## చదువు ద్వారానే సమాజంలో మార్పు వస్తుంది

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సమాజంలోని ప్రతి ఒక్కరు సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలు స్ఫూర్తి గా తీసుకని ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న 375 వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ముందుగా జిల్లా కలెక్టర్ సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆనాటి మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే కాకుండా ప్రజలలో పోరాట పటిమ పై దశ, దిశ, నిర్దేశం చేస్తూ వారికి న్యాయం చేసేందుకు కృషి చేశారని అన్నారు. సర్వాయి పాపన్న అట్టడుగు,బలహీనవర్గాల సంక్షేమానికి కృషి చేశారని, కోటలు కట్టించారని, సాగునీటి మీద పోరాటం చేశారని తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సమస్యలపై దృష్టి పెట్టి సమాజంలో వెలుగు నింపాలని, ప్రజలలో ప్రేరణ తీసుకొచ్చి సమాజంలో మార్పులు తీసుకురావాలని ,అందుకు చదువు ఒకటే పరిష్కారం అని అన్నారు. చదువు ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, కొత్త తరానికి ఒక బలమైన జీవితాన్ని ఇవ్వడానికి కృషి చేయాలని కోరారు. వివిధ అభివృద్ధి పనులు, శాఖల వారి పనులు, విద్య ఆరోగ్యం మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని,సర్దార్ సర్వాయి పాపన్న చేసిన మంచి పనులను స్ఫూర్తిగా తీసుకుని పిల్లలకు చెప్పి వారిలో స్ఫూర్తి నింపాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. రాం బాబు,బీసీ సంక్షేమ అధికారి ఎల్. శ్రీనివాస్,షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి దయానంద రాణి,డి ఆర్ డి ఎ పి డి వి.వి. అప్పారావు,డీఈవో అశోక్,జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్,డీఎఫ్ఓ సతీష్, బొర్రా రాములు,గోపా జిల్లా ప్రెసిడెంట్,ఏలుగురి గోవిందు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రెసిడెంట్, వెంకన్న గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సెక్రటరీ, డాక్టర్ బంటు కృష్ణ,జర్నలిస్ట్ సంఘం జిల్లా సెక్రెటరీ,తన్నీరు రామ ప్రభు,బీసీ సంక్షేమ శాఖ స్టేట్ వైస్ ప్రెసిడెంట్, కంచుకోట వెంకట్, పోసల సంఘం ప్రెసిడెంట్, బీసీ సంఘం నాయకులు డా.ఊర రామ్మూర్తి,చలమల నరసింహ, సత్యనారాయణ పిళ్ళై అడ్వకేట్, టీఎన్జీవోస్ జిల్లా సెక్రెటరీ దున్న శ్యామ్,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

### గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి
## జిల్లా కార్యదర్శిగా ముకుందం గౌడ్



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా చేవెళ్ల మండల గొల్లగూడ గ్రామానికి చెందిన పి ముకుందం గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షులు రేవట్ల మల్లేష్ గౌడ్ ముకుందం గౌడ్ కు నియామక పత్రాన్ని అందజేశారు. మండల అధ్యక్షుడిగా బొబ్బిలి కుమార్ గౌడ్, మండల యూత్ అధ్యక్షుడిగా అలిమెల శేఖర్ గౌడ్ లకు రాష్ట్ర అధ్యక్షుడు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముకుందం గౌడ్ మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న గౌడ కులస్తుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుండి గౌడ కులస్తులకు సంబంధించిన పథకాలను వారికి చేరే విధంగా కృషి చేస్తానని తెలిపారు. జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ గౌడ్ కు ముకుందం గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.



## క్రీడారంగంలో పేట ఖ్యాతిని జాతీయస్థాయిలో చాటాలి

### స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

**సూర్యాపేట,రాజ ముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్,భారత క్రికెట్ జట్టు మాజీ సభ్యుడు ఎంఎస్ కె ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీని స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.కె ప్రసాద్ తోపాటు ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఫిజికల్ ఫిట్నెస్ ట్రైనర్ రమేష్ లను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ చిన్నారులు యువత క్రీడల్లో రాణించాలన్నారు, ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ సూర్యాపేటకు రావడం అభినందనీయం అన్నారు. గ్రామీణ క్రీడాకారులకు అకాడమీ అందుబాటులోకి తీసుకొచ్చిన ఎంఎస్.కె ప్రసాద్ కు అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణ నుంచి జాతీయస్థాయి క్రికెటర్ లేరన్నారు ఈ అకాడమీతో పేట క్రీడాకారులే జాతీయ స్థాయికి ఎదగాలని ఆశిస్తున్నాం అన్నారు.

## చేపలు పట్టడానికి వెళ్లి కాలువలో యువకుడి గల్లంతు

- చీకటి పడిన దొరకని యువకుడు ఆచూకీ
- కొనసాగుతున్న పోలీసుల సహాయక చర్యలు





**వలిగొండ,రాజముద్ర న్యూస్:** చేపల వేటకై వెళ్లి యువకుడు గల్లంతైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని వెలువర్తి గ్రామం చెరువులో నుండి అలుగు వరద వలిగొండ –వెలువర్తి గ్రామాల మధ్య గల కాజ్ వే వద్ద పెద్ద ఎత్తున ప్రవహిస్తుంది. అయితే మోత్కూర్ మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన శివరాత్రి నవీన్ అనే యువకుడుతో పాటు మరో ఇద్దరు చేపలు పట్టేందుకు రావడం జరిగింది. ఈ క్రమంలో నవీన్ చేపలు పడుతుండగా వరద ఉధృతికి కొట్టుకపోవడం జరిగింది. వెంటనే అతని మిత్రులు వెలువర్తి గ్రామస్తులకు మరియు తమ వారికి తెలియజేయడంతో వెతకడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న వెంటనే స్థానిక ఎస్ఐ యుగేందర్ గౌడ్, తహసిల్దార్ దశరథ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. వర్షం కురుస్తున్నప్పటికీ దాదాపు 3 గంటల పాటు గాలింపు చర్యలు కొనసాగిస్తూనే ఉండగా ఫైర్ సిబ్బంది సైతం సంఘటన స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టారు. చీకటి పడినప్పటికీ పోలీస్, రెవిన్యూ సిబ్బంది చీకటి పడినా కూడా సహాయక చర్యలు చేపట్టారు.



## కొప్పుల రమణమ్మ మృతికి గొంగిడి దంపతుల సంతాపం

**ఆత్మకూర్ (ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం ) మండలం సింగారం గ్రామానికి చెందిన కే హెచ్ ఆర్ ఫౌండేషన్ అధినేత బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి నానమ్మ కొప్పుల రమణమ్మ మృతి చెందారు. వారి మృతికి చింతిస్తూ మాజీ ప్రభుత్వ విప్, శాసన సభ్యురాలు సునీత మహేందర్ రెడ్డి, డిసిసిబి జిల్లా మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి నివాళులర్పించి ఆమె మృతదేహంపై పూలమాలవేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ జిల్లా నాయకులు కోరే బిక్షపతి, జిల్లా నాయకులు కాంభోజు భాను ప్రకాష్,స్థానిక మాజీ ఎంపీటీసీ పల్లెర్ల సత్యనారాయణ ఆత్మకూరు మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ నాయిని నర్సింహారెడ్డి,గడ్డం దశరథ గౌడ్, సోలిపురం అరుణ, ఉపేందర్ రెడ్డి, లగ్గాని రమేష్ గౌడ్ తిరుమల్ రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు దేవరపల్లి ప్రవీణ్ రెడ్డి, యూత్ విభాగం మండల అధ్యక్షులు ప్రతి కంఠం శాంతన్ రాజు,విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు చుంచు నాగరాజు, గజ్జెల్లి శంకర్,నాతి మల్లికార్జున్,గడ్డం సతీష్ గౌడ్,యాస మహేందర్ రెడ్డి,ఎండి అజీముద్దీన్, గజ్జెల్లి మహేష్ గజ్జెల్లి పరుశు రాములు,చెన్నూరు రాజు బిఆర్ఎస్ మండల నాయకులు సింగారం గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సెల్ఫీఫోటో మోజులో పడి ప్రమాదాలకు గురికావద్దు

### వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్



**వలిగొండ రాజముద్ర న్యూస్:** సెల్ఫీ ఫోటోల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహం వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, వాగులు ఉప్పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగులు వంకల వద్దకు జాలర్లు, ప్రజలు చేపల వేటకు వెళ్ళవద్దని సూచించారు. ఈత రాకుండా భారీ వరద ప్రవాహాల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురికాకూడదని తెలిపారు. ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు చెరువులు, వాగులు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన 100 నెంబర్ కు కాల్ చేసి తెలియజేయాలని వారు తెలిపారు.



## ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** బహుజనుల ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సబ్బండ వర్గాల సమానత్వం, వారి సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం ఐ.డి.ఓ.సి సమావేశం హాలు నందు వెనుకబడిన తరగతుల శాఖ అధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుదీర్ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...సర్వాయి పాపన్న 1650 లో జన్మించారని తండ్రి మరణించగా తల్లి ఆదేశాలతో గౌడ కులవృత్తిని ఎంచుకొని జీవనం సాగిస్తూ భూస్వామ్య వ్యవస్థ పై తిరుగుబాటు చేసి తెలంగాణ గడ్డ పై దళిత బహుజన మైనారిటీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించారని అన్నారు. కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలనే సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో నాటి కాలంలోనే పాపన్న గౌడ్ పోరాటం గొప్ప విషయమని అన్నారు. ఆధిపత్యాన్ని ఎదిరించి బహుజన రాజ్య స్థాపన చేసిన సర్వాయి పాపన్న అందరికి అధర్శనీయుడని, బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి సర్వాయి పాపన్న గౌడ్ ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో డి ఆర్ ఓ మంగి లాల్, ఆర్ డి ఓ వాసుచంద్ర, బి సి వెల్ఫేర్ అధికారి ఉపేందర్, జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాక్ ఓ డంపర్ ట్రక్కు..

### సౌదీ బృందం ఎదుట మునీర్ ప్రేలాపనలు..



**ఇస్లామాబాద్ :** ఆపరేషన్ సిందూర్ తర్వాత పోయిన పరువును కాపాడుకొనేందుకు పాక్ నేతలు, జనరల్స్ నోటికొచ్చిన ప్రేలాపనలు చేస్తున్నారు. ఆ దేశ ఆర్మీ చీఫ్ మునీర్ గతంలో కూడా 'డంప్ ట్రక్కు' వ్యాఖ్యలు చేశారట. నాడు సౌదీ ప్రతినిధుల బృందం సమక్షంలో ఈ ఘటన జరిగింది. ఆ వివరాలను తాజాగా ఆ దేశ ఇంటీరియర్ మినిస్టర్ మొహసిన్ నఖ్వీ వెల్లడించారు. మునీర్ మాటలు విని.. అతిథి బృందం మౌనంగా ఉండిపోయిందంట. సౌదీకి చెందిన ఓ ప్రతినిధుల బృందం మే నెల మధ్యలో పాకిస్థాన్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా వారు భారత్‌తో ఘర్షణ విషయంలో ఇస్లామాబాద్‌కు సలహా ఇవ్వబోయారు. దీంతో పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ కలుగ జేసుకొని "భారత్ ఓ మెరుస్తున్న మెర్సిడెస్ బెంజ్ లాంటిది.. కానీ, మనం రాళ్లతో నిండిన డంప్ టక్కు లాంటి వాళ్లం. రెండు ఢీకొంటే ఏమవుతుందో వూహించుకోండి" అని వ్యాఖ్యానించారట. దీంతో సౌదీ ప్రతినిధుల బృందం మౌనంగా ఉండిపోయిందిట. ఈ విషయాన్ని లాహోర్‌లో జరిగిన ఓ సెమినార్‌లో మాట్లాడుతూ పాక్‌మంత్రి నఖ్వీ వెల్లడించారు. ఇదే మంత్రి ఆపరేషన్ సిందూర్ సమయంలో ఒక్క భారత క్షిపణి కూడా తమ దేశ భూభాగాన్ని తాకలేదని అబద్ధాలు చెప్పారు. ఇటీవల అమెరికాలోని టంపాలో జరిగిన ఓ ప్రైవేటు విందులో కూడా మునీర్ ఇటువంటి వ్యాఖ్యలే చేశారు.


## పంట సాగుకు అవసరమైన యూరియాను

# రైతులకు అందేలా చూడాలి

- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వానాకాలం పంట సాగుకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే.రామ కృష్ణ రావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్ రావు లతో కలిసి యూరియా, ఎరువుల లభ్యత పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి అదనపు కలెక్టర్ సుదీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మే చివరి వారంలో వర్షాలు ప్రారంభం కావడం, జూలై ఆగస్టు నెలలో మంచి వర్షాలు కురువడం వల్ల రాష్ట్రంలో వరి, పత్తి, మిర్చి, పప్పు దినుసులు వంటి అనేక రకాల పంటలు రైతులు ఒకేసారి సాగు చేయడం, మన రాష్ట్రానికి కేటాయించిన యూరియా స్టాక్ సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వంటి వివిధ కారణాల వల్ల కొంత యూరియా సమస్య ఉందని అన్నారు. చైనా, జర్మనీ, ఇరాన్, యుమాన్ వంటి పలు దేశాల నుంచి రావాల్సిన యూరియా సరఫరా కావడం లేదని అన్నారు. మెంత్తం మూడు లక్షల మెట్రిక్ టన్నుల తక్కువ సరఫరా జరిగిందని మంత్రి తెలిపారు. మన దగ్గర గతంలో ఉన్న 2 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ తో రైతులకు ఇప్పటి వరకు కొంత మేర సరఫరా చేసామని అన్నారు. రుణ మాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, ఉచిత



కరెంట్ , రైతు బీమా, ధాన్యం కొనుగోలు వంటి అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం ఇప్పటివరకు లక్షా 13 వేల కోట్లు ఖర్చు చేసిందని, యూరియా కోసం రైతులు గంటల సమయం లైన్ లో నిలబడటం వల్ల కొంత అసంతృప్తి చెందుతున్నారని మంత్రి తెలిపారు. రాబోయే 45 రోజుల పాటు యూరియా సరఫరా పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. మండల స్థాయిలో స్టాక్ వివరాలు మానిటరింగ్ చేయాలని, ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి యూరియా తరలించాలని అన్నారు. ప్రస్తుతం ప్రైవేటు డీలర్ల వద్ద 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, అది సక్రమంగా విక్రయం జరగాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమలకు యూరియా డైవర్ట్ కావడానికి వీలు లేదని, రైతులు అధికంగా స్టాక్ పెట్టుకోవద్దని, అవసరం మేరకే కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. యూరియా సరఫరా పై పత్రికలో వ్యతిరేక వార్తలు రాకుండా ముందస్తుగా పరిస్థితుల గురించి పాత్రికేయులకు వివరించాలని అన్నారు. యూరియా సరఫరా చేసేందుకు చేపట్టిన చర్యలు రైతులకు మీడియా ద్వారా తెలిసేలా చూడాలని అన్నారు. సీఎస్ కే.రామకృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఒక వైపు విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికీ యూరియా కొరత కొంత ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. జియో పొలిటికల్ కారణాల వల్ల దేశానికి యూరియా సరఫరా దెబ్బతిందని, రామగుండం ఆర్.ఎఫ్.సి.ఎల్ ప్లాంట్ లో సాంకేతిక కారణాలవల్ల ఉత్పత్తి పలుమార్లు నిలిచిపోవడం వంటి కారణాల వల్ల మన దగ్గర కొంత యూరియా కొరత ఉందని అన్నారు. యూరియా ఇతర ఎరువుల లభ్యత వివరాలను కలెక్టర్ లు ప్రతిరోజు పర్యవేక్షించాలని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మార్క్ ఫెడ్, ప్రైవేట్ కంపెనీల వద్ద మండల స్థాయి వరకు స్టాక్ ఎంత ఉందో రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని అన్నారు. మండలాల వారీగా సాగు ఎంత అవుతుంది, ఎరువుల లభ్యత బేరీజు వేసుకొని అందుబాటులో ఉన్న ఎరువుల స్టాక్ సమర్థవంతంగా శాస్త్రీయంగా కేటాయింపు చేయాలని సూచించారు. ప్రతిరోజు జిల్లాలకు ఎరువుల రేక్ స్టాక్ ఎంత వరకు రాబోతున్నాయి వంటి అంశాలను కలెక్టర్ కు ముందస్తుగా తెలియజేస్తామని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా వ్యవసాయం కోసం మాత్రమే వినియోగించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, రైతులు ముందస్తుగా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవద్దని, ప్రస్తుత అవసరాల కోసం మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని అన్నారు. వ్యవసాయ అధికారులతో పాటు జిల్లాలో ఇతర ముఖ్యమైన అధికారులతో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి ప్రైవేట్ ఎరువుల డీలర్ల షాపు లను ఆకస్మిక తనిఖీ చేయాలని అన్నారు. యూరియా అవసరం ఉన్న పరిశ్రమలు జిల్లాలో ఉంటే వాటిని ఆకస్మిక తనిఖీ చేయాలని, వ్యవసాయ సంబంధిత ఎరువులను పరిశ్రమల కోసం వినియోగిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. జూన్, జూలై నెలల్లో అధికంగా యూరియా కొనుగోలు చేసిన బయ్యర్స్, రెగ్యులర్ గా కొనుగోలు చేసే బయ్యర్స్ వివరాలను ట్రాక్ చేయాలని వీరు ఎక్కడైనా యూరియా డైవర్ట్ చేస్తున్నారా పరిశీలించాలని అన్నారు. జిల్లాలలో అవకాశం ఉన్న చోట ప్రత్యామ్నాయంగా డ్రోన్ ద్వారా నానో యూరియా, డిఏపి కాంప్లెక్స్ ప్రోత్సహించాలని సి.ఎస్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్సు లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లా లో ఆగష్టు నెలకు సంబంధించి 11,200 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, ఇప్పటివరకు 4250 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించడం జరిగిందని, వరి నాట్లు వేసే దశలో ఉన్నది, ఈ నెల చివరి నాటికి రైతులకు మొదటి దఫా యూరియ అందుబాటులో ఉందని, జిల్లా లో టాస్క్ పోర్సు బృందాలను ఏర్పాటు చేస్తామని, నానో యూరియ వాడకం పై రైతులకు అవగాహనా కలిపిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, వ్యవసాయ అధికారి రాజా రత్నం, జనరల్ మేనేజర్ మహేశ్వర్, మార్కెటింగ్ అధికారి సారంగా పాణి , సంబంధిత అధికారులు తదితరలు పాల్గొన్నారు

## సిసి రోడ్లు, మురుగునీటి కాలువలు లేక ఇబ్బంది పడుతున్న

# కాటమయ్య బస్తి ప్రజలు

- ఎంఏ ఇక్బాల్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు
- మోరిగాడి రమేష్ సిపిఎం పట్టణ నాయకులు



**ఆలేరు, రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ కాటమయ్య నగర్ కాలనీ లో సోమవారం రోజున సిపిఎం పోరుబాట సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమస్యను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాటమయ్య బస్తీ ద్వారకా నగర్ కాలనీలలో సిసి రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం లేకపోవడం వలన గత కొంతకాలంగా పట్టణంలో కురుస్తున్న వర్షాలకు కాలనీలలోని రోడ్లు బురద గుంతలుగా ఏర్పడి కాలనీ వాసులు ఇంటి నుండి బయటకు రాలేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. సమస్యలను పరిశీలించినప్పుడు అక్కడి ప్రాంత ప్రజలు అనేకమంది సిపిఎం బృందం దగ్గరికి వచ్చి ఈ ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు, ప్రభుత్వం సైతం నిర్లక్ష్య వహిస్తున్నారని వారు వాపోయారు. ఈ విషయమై సిపిఎం నాయకులు మాట్లాడుతూ గతంలో స్థానిక ఎమ్మెల్యేకి ఈ ప్రాంతంలోని సమస్యలను చెప్పి చింతకింది గీతాంజలి ఇంటి నుంచి మైలారం రమేష్ ఇంటి వరకుసీసీ రోడ్ల నిర్మాణం ములుగు కాలువ నిర్మాణం చేపట్టాలని అదేవిధంగా ఘనగాని మల్లేశం ఇంటి నుండి మోరీగాడి వెంకటేష్ ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినప్పుడు వెంటనే సిసి రోడ్ నిర్మాణం చేపిస్తానని హామీ ఇచ్చారని, దాదాపుగా పది నెలలు గడిచిన పనులు ప్రారంభం కాకుండా ప్రజలు వర్షాకాలంలో అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. వర్షాకాలంలో గుంతలు ఏర్పడినప్పుడు పోయవలసిన మోరం సైతం నామమాత్రంగా బురద నీటిలో ఎంతో కొంత చల్లినట్టు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఈ సందర్భంగా అన్నారు. ఈ ప్రాంతంలో వీధి లైట్లు సైతం లేక చీకటి అయితే అనేక కాలనీలు అంధకారంలో ఉంటున్నాయని ఆలేరు రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్నటువంటి పాత వాటర్ ఫిల్టర్ ఏరియాలో లైట్లు, పాత ఎమ్మార్వో కార్యాలయం కాలనీలోని లైట్లు, కాటమయ్య బస్తీలోని మైలారం రమేష్ ఇంటి ప్రాంతంలో శివాలయం వీధిలోని వీధిలైట్లు వెలగడం లేదని గతంలో ఈ ప్రాంత ప్రజలు మున్సిపల్ అధికారులకు అనేకసార్లు విన్నవించుకున్నప్పటికీ నెలలు గడిచిన కనీసం వీధిలైట్లు ఏర్పాటు చేయలేని దీన స్థితిలో ఆలేరు మున్సిపాలిటీ ఉందని ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను తెలియజేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వడ్డేమాన్ బాలరాజు, ఎండి మతి యాసారపు ప్రసాద్, ఎండి ఖలీల్ బర్ల సిద్దులు, లక్కాకుల శీను, బేతి రఘురాములు, అంగిరేకుల భాగ్య, రుద్రవీణ, పప్పి, రచ్చ రాజేష్, రచ్చ వజ్రమ్మ, కటకం పుష్పమ్మ, మొరిగాడి అనిత, కుడుదుల భాగ్య పాల్గొన్నారు.

## ఆంక్షల నడుమ.. కొనుగోలుదార్లను వెతుక్కుంటూ

# రష్యా సహజవాయువు నౌకలు..

**రష్యా :** అమెరికా ఆంక్షలకు గురైన రష్యాలోని ఓ సహజవాయువు కేంద్రం నుంచి రెండు ట్యాంకర్లు కొనుగోలుదార్లను వెతుక్కుంటూ ఆసియాకు బయల్దేరాయి. ఓవైపు వాషింగ్టన్‌లో శాంతిచర్చల వేళ.. ఈ ధ్రువీకృత సహజవాయువు (ఎల్ఎన్‌జీ) సరఫరా చేస్తున్న భారీ నౌకలు ఆసియా వైపు రావడం చర్చనీయాంశంగా మారింది. ది ఐరిస్, వోస్కోడ్ నౌకలు సైబీరియాలోని ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ-2 ప్లాంట్ నుంచి ఉత్తర ఆసియాకు బయల్దేరాయి. ఉత్తర సముద్ర మార్గంలో ప్రయాణం మొదలుపెట్టాయని బ్లూమ్‌బెర్గ్‌షిప్ ట్రాకింగ్ డేటా వెల్లడిస్తోంది. వాస్తవానికి ఈ ట్యాంకర్లు కొన్ని నెలల పాటు సముద్రంలో ఖాళీగా ఉన్నాయి. ఆర్కిటిక్-2 ప్లాంట్‌ను నోవాటెక్ పీజేఎస్‌సీ నిర్వహిస్తోంది. 2030 నాటికి రష్యా గ్యాస్ ఎగుమతులను మూడింతలు చేయాలన్న లక్ష్య సాధనకు ఈ కంపెనీ అత్యంత కీలకమైంది. ఐరోపా నుంచి పైప్‌లైన్‌లో గ్యాస్ కొనుగోళ్లు తగ్గాక ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తూ మాస్కో ఈ లక్ష్యాన్ని ఎంచుకొంది. ఆర్కిటిక్-2 ప్లాంట్ గత వేసవిలో దాదాపు ఎనిమిది కార్గోలను ఎగుమతి చేసింది. కానీ, అక్టోబర్ నాటికి మంచు తీవ్రం కావడంతో కొనుగోలుదారులు దొరక్క ఉత్పత్తి నిలిపివేసింది. ఈ ప్లాంట్‌పై బైడెన్ కార్యవర్గం ఆంక్షలు విధించింది. ఆర్కిటిక్-2 ఈ ఏడాది జూన్‌లో తిరిగి నౌకల్లో ఎల్ఎన్‌జీ నింపడం మొదలు పెట్టింది. ఇప్పటివరకు అక్కడినుంచి బయల్దేరిన నౌకలు ఏ పోర్టులోనూ ఆగలేదు. ఇక్కడినుంచి ఆసియాకు బయల్దేరిన నాలుగు నౌకలు కొనుగోలు దారులను వెతుక్కొంటూ ఆసియాకు బయల్దేరాయి. మంచులో ప్రయాణించే మరో డజన్ నౌకలను ఆర్కిటిక్-2 కోసం సిద్ధంగా ఉంచారు. రష్యా నుంచి చమురు, సహజవాయువు అత్యధికంగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్, చైనా ముందు వరుసలో ఉన్నాయి. ఇప్పటికే న్యూదిల్లీపై వాషింగ్టన్ పెనాల్టీలు విధించిన విషయం తెలిసిందే.

## సమాధానాలకు బదులు.. 'సీఈసీ' ఎదురుదాడి : ప్రతిపక్షాలు



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ఓట్ల చోరీ ఆరోపణలపై ఎన్నికల సంఘం సరైన సమాధానాలు ఇవ్వలేకపోయిందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఈసీ తన బాధ్యతల నుంచి తప్పించుకుంటోందని ఆరోపించాయి. ఓట్ల చోరీ ఆరోపణలపై ఆదివారం నాటి ఈసీ సమావేశంపై ప్రతిపక్ష నేతలు మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్రలో పెద్దసంఖ్యలో ఓటర్లను చేర్చడం, మహదేవపురలో ఓటర్ల జాబితాలో లోపాలు, పోలింగ్ ప్రక్రియ వీడియో డేటా తొలగింపు వంటి అంశాలపై ఎన్నికల సంఘం మౌనంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ విమర్శించారు. ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ సరైన సమాధానాలు చెప్పాల్సింది పోయి.. ఎదురుదాడికి దిగారని గొగొయ్ ఆరోపించారు. ఎన్నికల సంఘం పక్షపాత అధికారుల చేతుల్లో ఉందని, ప్రతిపక్షాలు చేసిన ఏ ఆరోపణలనూ దర్యాప్తు చేయడం లేదన్నారు. సీఈసీపై అభిశంసన వ్యవహారంలో సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## వినాయకుడి మండపానికి రూ.474 కోట్లకు ఇన్సూరెన్స్



**ముంబయి:** గణపతి నవరాత్రి ఉత్సవాలకు యావత్ దేశం సిద్ధమవుతోంది. విభిన్న ఆకృతుల్లో కొలువుదీరే వినాయకుల కోసం మండపాలను ముస్తాబు చేయనున్నారు. ఖరీదైన గణేశ్‌మూర్తులు, భారీ సెట్టింగ్‌లతో తాత్కాలిక మండపాలు ప్రతి ఏటా ఆకర్షణగా నిలుస్తుంటాయి. ఈ నేపథ్యంలో ముంబయిలోని ఓ గణేశ్ మండపానికి ఏకంగా రూ.474.46 కోట్లకు ఇన్సూరెన్స్ చేయించారని జాతీయ మీడియా కథనం పేర్కొంది. ముంబయి శివారులోని మతుంగా ప్రాంతంలో గత ఏడు దశాబ్దాలుగా జీఎస్‌బీ సేవామండల్ వినాయక చవితి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ఈసారి 71వ వార్షికోత్సవం జరగనుంది. దేశంలోనే సంపన్న వినాయకుడిగా పేరొందిన ఈ విఘ్నేశ్వరుడి వేడుకలకు ఈ ఏడాది ఏకంగా రూ.474.46 కోట్లకు బీమా చేయించారట. ఇక్కడి విగ్రహాన్ని భారీఎత్తున బంగారం, వెండి ఆభరణాలతో అలంకరించనుండటమే అందుక్కారణం. గతేడాది సైతం ఈ గణేశ్ మండపానికి రూ.400.58 కోట్లకు బీమా చేయించినట్లు నిర్వాహకులు మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం పూజారులు, నిర్వాహకులు, సహాయకులు, భద్రతా సిబ్బందికి రూ.375 కోట్లకు వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నారు. గణపయ్యకు అలంకరించే బంగారం, వెండి, ఆభరణాలకు రూ.67 కోట్ల బీమా వర్తించనుంది. 2023, 2024ల్లో ఆ మొత్తం రూ.38 కోట్లు, రూ.43 కోట్లుగా ఉంది. అగ్నిప్రమాదం, భూకంపం ముప్పు వంటి వాటికోసం ప్రత్యేకంగా మరో రెండు కోట్ల రూపాయల బీమా తీసుకున్నారు. అక్కడి ఫర్నీచర్, కంప్యూటర్లు, సీసీటీవీలు, స్కానర్లు ఇన్సూరెన్స్ పరిధిలో ఉన్నాయి. పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ కింద రూ.30 కోట్లు కేటాయించారు. భక్తుల సౌలభ్యం కోసం క్యూఆర్ కోడ్, డిజిటల్ లైవ్ సేవలను కూడా నిర్వాహకులు అందుబాటులోకి తెచ్చారు. భద్రతా చర్యల్లో భాగంగా ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలను కూడా ఏర్పాటుచేశారు.

# ఓపెనర్‌గా సంజు వద్దు.. ఆ ముగ్గురిలో ఒకరు బెటర్: క్రిష్



ఆసియా కప్ కోసం జట్టును ప్రకటించేందుకు బీసీసీఐ ముమ్మర సన్నాహాలు చేసింది. దీనిపై ప్రకటన మంగళవారం ఉండొచ్చని సమాచారం. దీంతో మాజీ క్రికెటర్లు తమ అంచనాలతో ముందుకొచ్చారు. ఇప్పటికే హర్భజన్ సింగ్ తన టీమ్‌ను ప్రకటించగా.. తాజాగా మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా జట్టులో ఎవరు ఉండాలనే దానిపై స్పందించాడు. ఓపెనర్‌గా అభిషేక్ శర్మతోపాటు ఇన్నింగ్స్‌ను ప్రారంభించేవారెవరు? అలాగే వికెట్ కీపర్‌గా ఎవరు ఉండాలనే దానిపై విశ్లేషించాడు. "సంజుశాంసన్ షార్ట్ బాల్‌కు ఇబ్బందిపడటం గతంలోనే చూశాం. కాబట్టి అతడు ఓపెనింగ్ చేయడం చాలా కష్టం. నేనే సెలెక్టర్‌ను అయి ఉంటే తొలి రెండు ఛాయిస్‌లుగా వైభవ్ సూర్యవంశీ, సాయి సుదర్శన్‌లను ఎంపిక చేస్తా. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ స్క్వాడ్ కోసమూ వైభవ్‌ను తీసుకుంటా. అతడు చాలా బాగా ఆడుతున్నాడు. ఐపీఎల్‌లో సాయి సుదర్శన్ ఆరెంజ్ క్యాప్ హెూల్డర్. అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. యశస్వి జైస్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అందుకే, ఈ ముగ్గురిలో ఒకరిని అభిషేక్‌శర్మతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించేలా చేస్తా. ఇక వికెట్ కీపర్ రేసులో సంజుశాంసన్, జితేశ్ శర్మ ఉన్నారు. నాకు మాత్రం జితేశ్ బెటర్ అనిపిస్తోంది" అని క్రిష్ వెల్లడించాడు.

### గిల్‌కు అవకాశం కష్టమేనా?

గత టీ20 ప్రపంచకప్ సమయంలో రోహిత్ శర్మ - విరాట్ కోహ్లీ ఓపెనర్లుగా దిగారు. వారికి బ్యాకప్‌గా గిల్‌ను కాకుండా యశస్వి జైస్వాల్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఇప్పుడు ఆ సీనియర్ ప్లేయర్లు ఇద్దరూ వీడ్కోలు పలికారు. రిషభ్ పంత్ వన్‌డౌన్‌లో ఆడగా.. ఈసారి అతడికి గాయం నేపథ్యంలో ఎంపిక చేసే అవకాశాలు లేవని సమాచారం. దీంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు గిల్‌కు అవకాశం లభిస్తుందని అంతా భావిస్తున్నారు. ఒకవేళ ఎంపిక చేసినా ఇప్పుడే కెప్టెన్‌గా నియమించకపోవచ్చు. మరోవైపు సూర్యకుమార్ యాదవ్ ఈ టోర్నీలో జట్టును నడిపించవచ్చు. అయితే ఆసియా కప్‌లో బ్యాటర్‌గా, కెప్టెన్‌గా సూర్య తనదైన ముద్ర వేయాల్సి ఉంది. అతను రెండువిధాలా సత్తా చాటి జట్టుకు కప్పు అందిస్తే.. అతన్ని తప్పించలేని పరిస్థితి తలెత్తుతుంది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ వరకు కూడా సారథిగా కొనసాగే అవకాశముంది. లేదంటే మాత్రం శుభ్‌మన్‌కు పగ్గాలు ఇచ్చేయక తప్పదని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి.






# రూ.లక్ష కోట్లతో కేంద్రం కొత్త పథకం

## సంస్థలు, ఉద్యోగులకు ప్రోత్సాహకాలు

**న్యూఢిల్లీ :** దేశంలో కొత్త ఉద్యోగాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. 'ప్రధానమంత్రి వికసిత్ భారత్ ఉపాధి యోజన' పేరిట పోర్టల్‌ను ప్రారంభించింది. యజమానులు, తొలిసారి ఉద్యోగంలో చేరేవారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందొచ్చని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకానికి కేంద్ర కేబినెట్ జులై 1న ఆమోదం తెలిపింది. పథకం ద్వారా రూ.లక్ష కోట్లతో వచ్చే రెండేళ్లలో (2025 ఆగస్టు 1 - 2027 జులై 31) 3.5 కోట్లకుపైగా ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకాన్ని పార్ట్ ఏ, పార్ట్ బీ అని రెండు భాగాలుగా విభజించినట్లు కేంద్రమంత్రి తెలిపారు. పార్ట్ ఏ కింద మొదటిసారి ఉద్యోగంలో చేరిన వారికి ప్రోత్సాహకాలు లభిస్తాయి. అంటే సగటున ఒక నెలజీతం, గరిష్ఠంగా రూ.15 వేల వరకు ఉంటుంది. ఇది రెండు విడతల్లో చెల్లిస్తారని ఆయన తెలిపారు. రూ.లక్ష వరకు గ్రాస్ వేతనం పొందే ఉద్యోగులందరూ పార్ట్- ఏ కిందకు వస్తారు. ఇక పార్ట్ బీ కింద యజమానులకు మద్దతు ఇస్తారు. వీరికి మూడు స్లాబుల్లో ఈ ప్రోత్సాహకాలు అందుతాయి. ఉద్యోగి నెలజీతం రూ.10 వేల అయితే యజమానికి రూ.1000 ప్రోత్సాహకం అందుతుంది. అలాగే ఉద్యోగి నెలజీతం రూ.10 - 20 వేల మధ్య ఉంటే యజమానికి రూ.2 వేలు.. రూ.30 వేల వరకు జీతం ఉంటే యజమానికి రూ.3 వేల ప్రోత్సాహకం లభిస్తుంది. ఇది కేవలం ఒక ఉద్యోగికి ఒకసారి మాత్రమే వర్తిస్తుంది. ఈ పథకం ద్వారా ముఖ్యంగా తయారీరంగంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పార్ట్-బీలో ప్రతి అదనపు ఉద్యోగి (తొలిసారి చేరినవారు, రీ-జాయినీ)పై సంస్థకు నెలకు గరిష్ఠంగా రూ.3 వేల వరకు ప్రోత్సాహకం లభిస్తుంది. ఉద్యోగి కనీసం ఆరునెలలపాటు కొనసాగితే ఈ ప్రోత్సాహకం రెండేళ్ల పాటు చెల్లిస్తారు. తయారీ రంగంలోని సంస్థలకు మాత్రం ఇది నాలుగేళ్లపాటు లభిస్తుంది. దీనికి అర్హత పొందాలంటే.. 50 మందికి తక్కువ ఉద్యోగులు ఉన్న సంస్థలు కనీసం ఇద్దరిని, 50 మందికి ఎక్కువ ఉద్యోగులు ఉన్న సంస్థలు కనీసం ఐదుగురిని అదనంగా నియమించుకోవాలి. వీరిని కనీసం ఆరు నెలలపాటు కొనసాగించాల్సి ఉంటుంది.

## యువకులతో నిండిన భారత జట్టు

# అద్భుతంగా ఉంది : వాషింగ్టన్ సుందర్



యువకులతో నిండిన టీమ్‌ఇండియా అద్భుతంగా ఉందని ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కొనియాడాడు. అలాగే ప్రస్తుతం జట్టులో ఉన్న ప్రతి ఒక్కరు బాధ్యతలు తీసుకునేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నాడు. ఇటీవల ముగిసిన తెందూల్కర్- అండర్సన్ ట్రోఫీలో వాషింగ్టన్ సుందర్ ఇటు బంతితోనూ, అటు బ్యాట్‌తోనూ అద్భుతంగా రాణించాడు. 'నిజం చెప్పాలంటే డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం అద్భుతంగా ఉంది. ప్రస్తుతం టీమ్‌ఇండియా అంతా యువకులతో నిండి ఉంది. అనుభవం అంతగా లేకున్నా.. ఇంగ్లాండ్ టూర్‌లో టీమ్‌ఇండియా ఆటగాళ్లు చక్కగా రాణించారు. ప్రతి ఒక్కరూ తమ బెస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నించారు. ప్రస్తుతం భారతజట్టు సమతూకంగా ఉంది' అని వాషింగ్టన్ సుందర్ వివరించాడు. తెందూల్కర్- అండర్సన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌తో జరిగిన అయిదు టెస్ట్‌మ్యాచ్‌ల సిరీస్‌ను టీమ్‌ఇండియా 2-2తో సమం చేసుకోగలిగింది. ఈ సిరీస్‌లో వాషింగ్టన్ సుందర్ తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. నాలుగు టెస్ట్‌మ్యాచ్‌లు ఆడిన అతడు 284 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, హాఫ్ సెంచరీ ఉన్నాయి. అలాగే బౌలింగ్‌లోనూ ఏడు వికెట్లు సొంతం చేసుకున్నాడు. ముఖ్యంగా లార్డ్స్ టెస్ట్.. రెండో ఇన్నింగ్స్‌లో 22 పరుగులిచ్చి ఏకంగా 4 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన నాలుగో టెస్ట్ మ్యాచ్, రెండో ఇన్నింగ్స్‌లో 206 బంతులను ఎదుర్కొని 101 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈ అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శనతో ఇంగ్లాండ్ బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టాడు. రవీంద్ర జడేజాతో కలిసి చక్కటి భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఓవల్‌లో జరిగిన చివరి టెస్ట్‌లోనూ విలువైన పరుగులు రాబట్టాడు. కేవలం 46 బంతుల్లోనే 53 రన్స్ చేశాడు. టీమ్‌ఇండియా విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. జట్టులో రవిచంద్రన్ అశ్విన్ లేని లోటును భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నాడు.



## అఫ్రిది విషయంలో.. ఇర్ఫాన్ పఠాన్ చెప్పిందంతా

# పచ్చి నిజం : పాక్ మాజీ క్రికెటర్

'ఏంటి అతడు కుక్క మాంసం తింటాడా? మొరుగుతూనే ఉన్నాడు' ఇవీ పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది వ్యవహరించిన తీరుపై ఇర్ఫాన్ పఠాన్ చేసిన వ్యాఖ్యలు. 2006లో పాక్ పర్యటనకు వెళ్లినప్పుడు విమాన ప్రయాణంలో అఫ్రిది తనతో మాట్లాడుతూనే ఉండటంపై పఠాన్ అసహనం వ్యక్తంచేశాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆ వ్యాఖ్యలను గుర్తు చేసుకున్నాడు. దీనిపై అఫ్రిదికి ఒకప్పుడు సహచరుడు, పాకిస్థాన్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా స్పందించాడు. ఇర్ఫాన్ పఠాన్ చెప్పిందంతా నిజమని మద్దతుగా నిలిచాడు. అఫ్రిదికి ఎలా ప్రవర్తించాలో కూడా తెలియదని కనేరియా వ్యాఖ్యానించాడు. "ఇర్ఫాన్ నువ్వు చెప్పింది కరెక్ట్. అతడు (అఫ్రిది) ఎప్పుడూ వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తుంటాడు. ఫ్యామిలీ లేదా మతం వంటి విషయాలను తీసుకొస్తాడు. క్లాస్‌గా ఉండటం, మర్యాద ఇవ్వడం అతడికి అస్సలు చేత కాదు" అని డానిష్ పోస్టు చేశాడు. తన కెరీర్ సమయంలోనూ అఫ్రిది మతం మారమని ఒత్తిడి తీసుకొచ్చేవాడని గతంలో కనేరియా సంచలన వ్యాఖ్యలు చేశాడు.

### ఈ మ్యాచ్ జరగాలి..

"బీసీసీఐ తప్పకుండా తుది నిర్ణయం ఇప్పుడే తీసుకోవాలి. ఆసియా కప్‌లో భారత్ - పాక్ మ్యాచ్ జరిగేలా చూడాలి. భారత ప్రభుత్వం నుంచి కూడా పచ్చ జెండా వస్తుందని ఆశిస్తున్నా. సెప్టెంబర్ 14న లీగ్‌స్టేజ్‌లో ఇరుదేశాలు తలపడతాయి. ఎప్పుడు ఇరుజట్ల మధ్య మ్యాచ్ ఉన్నా సరే ఆ హైప్ మామూలుగా ఉండదు. అభిమానులూ ఉత్సాహంగా ఉంటారు. తీవ్రఒత్తిడి ఉండే మ్యాచ్‌లో అదరగొడితే ఓవర్‌నైట్ స్టార్ అయిపోవడం ఖాయం" అని వెల్లడించాడు.

### ఆ ఇద్దరూ ఉండాల్సిందే..

వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీకి ఇంకా రెండేళ్ల సమయం ఉంది. కేవలం 50 ఓవర్ల క్రికెట్‌లో కొనసాగుతోన్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని వరల్డ్ కప్‌లో ఆడించాలని డానిష్ కనేరియా వ్యాఖ్యానించాడు. "ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనకు బీసీసీఐ యంగ్ టీమ్‌ను పంపింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేకుండానే బరిలోకి దిగింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భారీగా పరుగులు చేశాడు. సాయి సుదర్శన్, యశస్వి జైస్వాల్ బాగా ఆడారు. అయితే, వన్డే ఫార్మాట్‌లో మాత్రం రోహిత్, విరాట్‌ను పక్కన పెట్టొద్దు. వన్డే ప్రపంచకప్‌లో వారిద్దరినీ ఆడించాలి. గిల్‌ను వన్డే సారథిగా నియమించినా ఫర్వాలేదు. కానీ, సీనియర్లు మాత్రం ఉండాలి" అని కనేరియా వ్యాఖ్యానించాడు.

# బుమ్రాతో టెస్ట్ మ్యాచ్‌లే ఆడించాలి

## సునీల్ గావస్కర్



ఇంగ్లాండ్ టూర్‌లో భాగంగా టీమ్‌ఇండియా అయిదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడింది. అయితే వర్క్‌లోడ్ నేపథ్యంలో జస్‌ప్రీత్ బుమ్రా కేవలం మూడు మ్యాచుల్లోనే పాల్గొన్నాడు. అతడు రెండో, అయిదో టెస్ట్ మ్యాచ్‌లు ఆడలేదు. ఇది క్రికెట్ ప్రపంచంలో తీవ్ర చర్చకు దారి తీసింది. త్వరలో ఆసియా కప్ జరగనున్న నేపథ్యంలో భారత జట్టులో బుమ్రాకు చోటు దక్కడం కూడా అనుమానంగానే ఉంది. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ సైతం.. కోచ్ గౌతమ్ గంభీర్, బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు ఈ విషయంలో ఓ సలహా ఇచ్చాడు. బుమ్రా సేవల్ని సుదీర్ఘ ఫార్మాట్‌కు వినియోగించుకోవాలని, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌నకు ప్రాముఖ్యం ఇవ్వాలని సూచించాడు. జస్‌ప్రీత్ బుమ్రాతో ఎక్కువగా టెస్ట్ మ్యాచ్‌లే ఆడించాలని సూచించాడు. సెలక్టర్లు బుమ్రాను వైట్ బాల్ క్రికెట్‌కు కాకుండా, రెడ్ బాల్ క్రికెట్‌కు ఎంపిక చేయాలన్నాడు. 'జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో సెలక్టర్లు ఓ నిర్ణయానికి రావాలి. ఇటీవల ఇంగ్లాండ్ టూర్‌లో అతడు కేవలం మూడు మ్యాచ్‌లే ఆడాడు. ఇది పెద్ద చర్చకు దారి తీసింది. అయితే అతడు తాను మూడు మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉంటానని, సెలెక్షన్ కమిటీకి ముందుగానే సూచించాడు. టీమ్‌ఇండియా తదుపరి టెస్ట్ మ్యాచ్‌లు అక్టోబర్ ప్రారంభంలో వెస్టిండీస్‌తో ఆడనుంది. ఆ తర్వాత నవంబర్‌లో సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ రెండు సిరీస్‌లకు మధ్య దాదాపు నెల రోజుల విరామం ఉంది. బుమ్రాకు ఈ విశ్రాంతి సరిపోతుంది. సెలక్టర్లు అతణ్ని చిన్న చిన్న ద్వైపాక్షిక సిరీస్‌ల కోసం పరిమితం చేయొద్దు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌ను దృష్టిలో పెట్టుకుని అతడి సేవల్ని సమర్థంగా ఉపయోగించుకోవాలి. కోచ్ గౌతమ్ గంభీర్, బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ మేరకు దృష్టి సారించాలి' అని సునీల్ గావస్కర్ పేర్కొన్నాడు.

# గంభీర్‌ది వారియర్ మైండ్‌సెట్



గత ఛాంపియన్స్ ట్రోఫీలో అదరగొట్టిన వరుణ్ చక్రవర్తి భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఇప్పుడు ఆసియా కప్ కోసం సన్నద్ధమవుతున్నాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్ల జాబితాలో అతడు ఉండటం ఖాయమే. ఫైనల్ 11లోనూ చోటు దక్కుతుంది. ఇప్పటి వరకు అంతర్జాతీయంగా 18 టీ20ల్లో 33 వికెట్లు తీసిన వరుణ్ మరోసారి యూఏఈలో కీలక పాత్ర పోషించాలని భావిస్తున్నాడు. తన లక్ష్యం వచ్చే వన్డే ప్రపంచ కప్ అని మనసులో మాట వెల్లడించాడు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అందించిన ప్రోత్సాహం ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నాడు. "ఐపీఎల్ తర్వాత ఆసియా కప్ బరిలోకి దిగేందుకు పరిమిత ఓవర్ల క్రికెట్ ప్లేయర్లకు చాలా సమయం దొరికింది. అప్పుడు నేను తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో ఆడా. అయినా సరే నాకు ఒక నెల బ్రేక్ వచ్చింది. నా స్ట్రెంత్ అండ్ కండీషనింగ్‌పై దృష్టి పెట్టా. ఫిట్‌నెస్, బౌలింగ్, బ్యాటింగ్‌పైనా సాధన చేశా. ఇక్కడ మరింత కీలక అంశం నా కుటుంబంతో గడిపా. ఇక నుంచి మళ్లీ మైదానంలోకి దిగేందుకు సన్నద్ధమవుతున్నా. ఆసియా కప్ తర్వాత పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌లు చాలా ఉన్నాయి. వీటన్నింటిలో ఆడటంతోపాటు నా లక్ష్యం వన్డే ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకోవడమే. తప్పకుండా అవకాశం వస్తుందని నమ్ముతున్నా. ఇప్పుడు ఆసియా కప్ కూడా యూఏఈ వేదికగా జరగనుండటం నాకు కలిసి వస్తుందని భావిస్తున్నా. బౌలింగ్ చేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని వరుణ్ వెల్లడించాడు.

### గౌతీ భాయ్ మద్దతుతో..

"ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రోత్సాహంతోనే కమ్‌బ్యాక్ చేయగలిగా. వారిద్దరూ ఇచ్చిన మోటివేషన్ మరిచిపోలేం. 'ఎవరు నిన్ను వదిలేసినా పట్టించుకోవద్దు. నా ప్రణాళికల్లో నువ్వు ఉంటావు' అని గంభీర్ చెప్పిన మాటతో కొండంత బలం వచ్చినట్లైంది. డ్రెస్సింగ్ రూమ్‌లోకి అతడు వారియర్ మైండ్‌సెట్ తీసుకొచ్చాడు. గంభీర్ మెంటార్‌గా ఉన్నప్పుడే కేకేఆర్ టైటిల్ గెలిచింది. ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీని సాధించాం. రోహిత్‌లాగే సూర్యకుమార్ కూడా వ్యూహాత్మకంగా బలంగా ఉంటాడు. గొప్ప సారథులతో అతడు కలిసి పనిచేశాడు. ఎప్పుడూ బౌలర్లపై ఒత్తిడి పెట్టడు" అని వరుణ్ చక్రవర్తి వ్యాఖ్యానించాడు.ఖ

# దులీప్ ట్రోఫీ నుంచి ఇషాన్ కిషన్ ఔట్

### ఆసియా కప్ సెలక్షన్‌కూ డౌటే?




భారత క్రికెట్ జట్టులోకి రావాలంటే తీవ్ర పోటీ నెలకొంది. ఫామ్‌తో పాటు ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం అత్యంత కీలకం. మరికొన్ని రోజుల్లో దేశవాళీలో దులీప్ ట్రోఫీ ప్రారంభం కానుండగా.. వచ్చే నెలలో ఆసియా కప్ జరగనుంది. ఈ సమయంలో గాయాల బెడదతో ఆటకు దూరమైతే జట్టులోకి రావడం చాలా కష్టం అవుతుంది. ఇప్పుడీ పరిస్థితి టీమ్‌ఇండియా వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌కు ఎదురైంది. దులీప్ ట్రోఫీ బరిలోకి దిగదామనుకున్న ఇషాన్ గాయం కారణంగా వైదొలిగాడు. ఒడిశా క్రికెట్ అసోసియేషన్ ఈ విషయాన్ని ఖరారు చేసింది. అతడి స్థానంలో ఆశీర్వాద్ స్వైయిన్‌ను తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇషాన్ నాయకత్వంలోనే ఈస్ట్‌జోన్‌కు ఆడాల్సిఉంది. ఇప్పుడు అతడి గైర్హాజరీలో వైస్ కెప్టెన్‌గా ఉన్న అభిమన్యు ఈశ్వరన్ నాయకత్వ బాధ్యతలు చేపట్టనున్నాడు. అయితే, ఇషాన్ గాయం పరిస్థితిపై మాత్రం ఒడిశా బోర్డు తన ప్రకటనలో వెల్లడించలేదు.

### వస్తాడనుకుంటే.. ఇప్పుడిలా

ఆసియా కప్ కోసం జట్టును ప్రకటించేందుకు బీసీసీఐ సెలక్షన్ కమిటీ సిద్ధమైంది. రిషభ్‌పంత్ గాయం కారణంగా ఆడటంపై ఇంకా స్పష్టత లేదు. ఇలాంటి సమయంలో సంజుశాంసన్, ఇషాన్ కిషన్, జితేశ్ శర్మ మాత్రమే వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ స్థానం రేసులో నిలిచారు. ఎడమచేతి వాటం బ్యాటర్ కావడం ఇషాన్‌కు కలిసొచ్చే అంశమే. కానీ, ఇప్పుడు గాయపడటంతో ఆసియా కప్‌లో ఇషాన్ ఆడటం దాదాపు కష్టమేనన్న అభిప్రాయం క్రికెట్ విశ్లేషకుల్లో నెలకొంది.

### చివరిగా ఎప్పుడు ఆడాడంటే..

గతేడాది ప్రపంచకప్ ముందువరకూ బీసీసీఐతో పొసగకపోవడంతో చాన్నాళ్లు దేశవాళీతోపాటు అంతర్జాతీయ క్రికెట్‌కూ దూరమయ్యాడు. చివరిసారిగా 2023లో జాతీయజట్టుకు ఆడాడు. దీంతో కౌంటీ క్రికెట్‌లో ఆడి తన ఫామ్‌ను అందిపుచ్చుకున్నాడు. 2025 ఐపీఎల్‌లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించి సెంచరీ బాదాడు. ఆ తర్వాత బీసీసీఐతో సయోధ్య కుదిరి మళ్లీ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. దీంతో జాతీయజట్టులోకి వచ్చేందుకు మళ్లీ దేశవాళీ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. ఇప్పుడు గాయంతో ట్రోఫీకే దూరం కావడం అతడి భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

## నిరుపయోగంగా

# 13 కోట్ల జన్‌ధన్ ఖాతాలు




దేశవ్యాప్తంగా 56.04 కోట్ల పీఎం జన్‌ధన్ ఖాతాల్లో దాదాపు 23 శాతం ఖాతాలు నిరుపయోగంగా ఉన్నట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ వెల్లడించారు. ఈ ఏడాది జులై 31 నాటికి 13.04 కోట్ల జన్‌ధన్ ఖాతాలు ఇన్‌ఆపరేటివ్‌లో ఉన్నట్లు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఇటువంటి ఖాతాలు అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో (2.75 కోట్లు) ఉన్నట్లు చెప్పారు. బిహార్ (1.39 కోట్లు), మధ్యప్రదేశ్ (1.07 కోట్లు) రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఆర్బీఐ నిబంధనల ప్రకారం.. ఒక పొదుపు ఖాతాలో వినియోగదారుడి తరఫు నుంచి రెండేళ్లకుపైగా ఎలాంటి లావాదేవీలు జరగకపోతే వాటిని ఇన్‌ఆపరేటివ్ ఖాతాగా పరిగణిస్తారు. అదేవిధంగా.. ప్రస్తుతం యూపీఐపై లావాదేవీల ఛార్జీలు విధించే ప్రతిపాదనేదీ లేదని మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి చౌధరీ సమాధానం ఇచ్చారు. "యూపీఐ సేవలు సజావుగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో దాదాపు రూ.8,730 కోట్ల ప్రోత్సాహకాలు అందించింది" అని చెప్పారు. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకాన్ని ప్రారంభించి పదేళ్లు పూర్తయిందని, పెద్ద సంఖ్యలో ఖాతాలకు రీ-కేవైసీ చేయాల్సి ఉందని ఇటీవల గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. రీకేవైసీకి ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు గడువు ఉందన్నారు.

# భారీ లాభాల్లో సూచీలు



దేశీయ మార్కెట్లు ఈ వారాన్ని భారీ లాభాల్లో ప్రారంభించాయి. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. సోమవారం మన సూచీలు దూసుకెళ్తున్నాయి. ఉదయం 9.34 గంటల సమయంలో సెన్సెక్స్ 1107 పాయింట్ల లాభంతో 81,704 వద్ద ఉంది. నిఫ్టీ 361 పాయింట్లు పుంజుకొని 24,999 వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 87.47గా ఉంది.

హీరో మోటార్‌కార్ప్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఆటో, ఎంఅండ్ఎం షేర్లు లాభాల్లో ఉన్నాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, లార్సెన్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఓఎన్‌జీసీ, టీసీఎస్ స్టాక్స్ నష్టాల్లో కదలాడుతున్నాయి. దీపావళి కల్లా జీఎస్‌టీ భారాన్ని బాగా తగ్గిస్తామంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటన స్టాక్‌మార్కెట్లకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. మన దేశ రేటింగ్‌ను 'బీబీబీ-' నుంచి 'బీబీబీ'కి ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ సవరించడం సానుకూలంగా మారింది. ఇక, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య జరిగిన చర్చల సారాంశం వెల్లడికాకున్నా.. సానుకూలంగా ముగిశాయని ఇరువర్గాలు ప్రకటించాయి. ఈ చర్చల వల్ల రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోన్న భారత్‌కు అమెరికా సుంకాల విషయంలో ఊరట లభించవచ్చేమోనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### జీఎస్టీపై మోదీ ప్రకటన..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేసిన ప్రసంగంలో మోదీ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల గురించి ఓ ప్రకటన చేశారు. జీఎస్‌టీ సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను రాష్ట్రాలకు కేంద్రం పంపించిందని, దీనికి అన్ని రాష్ట్రాలు సహకరిస్తాయని ఆశిస్తున్నామని చెప్పారు. ఈ ప్రతిపాదిత రెండు శ్లాబుల విధానాన్ని జీఎస్టీ మండలి ఆమోదిస్తే, ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల్లో 12, 28 శాతం శ్లాబులు తొలగిపోనున్నాయి. 5%, 18% శ్లాబులు మాత్రమే ఉండనున్నాయి. ఇది 'గేమ్ ఛేంజర్' సంస్కరణగా మిగిలిపోతుందని నిపుణులు భావిస్తున్నారు. ఇవి ఆమోదం పొందితే.. ఆటో, సిమెంట్ రంగాలకు లాభదాయంగా మారనుంది. ప్రస్తుతం ఈ రంగాలపై 28 శాతం జీఎస్టీ ఉంది. ఈ సంస్కరణల వల్ల ఇన్సూరెన్స్ కంపెనీలకు కూడా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. దీపావళికి జీఎస్టీ రేట్లు తగ్గితే, అందుబాటు ధరలో కార్లు వినియోగదార్లను మరింత ఆకర్షిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. పండగ ఉత్సాహానికి ఇది మరింత ఉపకరించనుంది. ప్రస్తుత జీఎస్టీ విధానంలో ఇంజిన్ సామర్థ్యం, వాహన పరిమాణానికి సంబంధించిన వర్గీకరణ వివాదాలను కొత్త పన్ను రేట్ల ప్రతిపాదన పరిష్కరిస్తుందని ఆశిస్తున్నారు. ఈ అంచనాలు నేటి ట్రేడింగ్‌లో మార్కెట్లకు ఫుల్ జోష్ ఇచ్చాయి.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## కొన్ని సినిమాలు ఓకే చేయాలంటే
# భయమేస్తోంది : నరేశ్



కొన్ని సినిమాలు ఓకే చేయాలంటే భయమేస్తోందని నటుడు నరేశ్ అన్నారు. సుహాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'హే భగవాన్'. ఇందులో నరేశ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా జరిగిన దీని టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ కొన్ని సినిమాలను అంగీకరించాలంటే డేట్స్ సర్దుబాటు చేయలేనేమోనని భయమేస్తుందన్నారు. "ఇప్పటివరకూ డేట్స్ విషయంలో నాపై ఒక్క ఫిర్యాదు కూడా లేదు. 'సామజవరగమన' కథ విన్నాక నాకు అందులో నటించడానికి డేట్స్ లేక చేయలేనని చెప్పా. అనిల్ సుంకర నెల రోజులు నాకోసం ఎదురుచూశారు. ఆ సినిమాను నా జీవితంలో మర్చిపోలేను. నేను ఎంత ఆలస్యమైనా ఎన్ని కథలైనా వింటాను. అలానే 'హే భగవాన్' కథ విన్నాక ఈ చిత్రాన్ని మిస్ అవ్వకూడదు అనుకున్నాను. అందుకే అంగీకరించాను. నాకోసం షూటింగ్ తేదీల్లో కొన్ని మార్పులు చేసినందుకు దర్శక నిర్మాతలకు థాంక్స్ చెప్పాలి. నేను ఏది మాట్లాడినా ఉన్నది ఉన్నట్లు చెబుతాను. ఇది అద్భుతమైన చిత్రం. టైటిల్‌తోనే అందరిలో ఆసక్తి కలిగించారు. సుహాస్ భవిష్యత్తులో ఉన్నతస్థాయికి వెళ్తాడు" అని అభినందించారు. "కొత్త రైటర్స్, దర్శకులే ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీకి దీపాలు. కొత్త కాన్సెప్ట్‌లతో అలరిస్తున్నారు. ఒకానొక సమయంలో మలయాళం, తమిళ సినిమాలు చూసి ఇలాంటి కథలు తెలుగులో రావా అనుకునేవాళ్లం. ఇది కంటెంట్ యుగం.. సుహాస్ కోసం దర్శకులు కంటెంట్ తయారుచేస్తున్నారు. హీరో కోసం ప్రత్యేకంగా కథలు రాయడమనేది నిజంగా గర్వకారణం. ఇంతకుముందు తమిళ, మలయాళ కథలను తెలుగులో రీమేక్ చేసేవాళ్లం. ఇప్పుడు ఇలాంటి సినిమాల తర్వాత తెలుగు కథలను మరో భాషలోకి రీమేక్ చేస్తారు"

# కోదమసింహాలో ఆ ఏమోషన్ లేదు
## ఆనాటి చిరు చిరు సినిమాపై రాజమౌళి అభిప్రాయం






ప్రస్తుతం రాజమౌళి మహేశ్‌బాబుతో మూవీ చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. యాక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నవంబరులో ఇందుకు సంబంధించిన లుక్‌ను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. సన్నివేశాలను భావోద్వేగంగా మలిచి ప్రేక్షకుడి మదిలో చెరగని ముద్ర వేయడంలో సిద్ధహస్తులు దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి అందుకే ఆయన తీసే సినిమాలు ప్రేక్షకులను అలరించడమే కాదు, బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపిస్తాయి. ఇక ఎమోషనల్ సన్నివేశాలు, హీరో ఎలివేషన్ సీన్స్ తీయడంలో ఆయనది ప్రత్యేకమైన శైలి. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'మగధీర' రామ్‌చరణ్ కెరీర్‌లో భారీ విజయాన్ని అందుకుంది. అందులోని ఓ సన్నివేశం భావోద్వేగభరితంగా రావడానికి చిరంజీవి నటించిన 'కొదమ సింహం'చిత్రమే కారణమని రాజమౌళి ఓ సందర్భంలో పంచుకున్నారు. అప్పట్లో థియేటర్‌లో 'కొదమసింహం' సినిమా చూస్తున్నా. అందులో రౌడీలు చిరును పీకల్లోతు ఇసుకలో పాతిపెట్టి వెళ్లిపోతారు. అక్కడే ఉన్న ఆయన గుర్రం ఆయన నోటికి తాడు అందించి కాపాడుతుంది. ఆ సీన్ చూసి తీవ్ర భావోద్వేగానికి గురయ్యా. అయితే, ఆ కష్టంలో నుంచి బయటకు వచ్చిన ఆయనకు, గుర్రానికీ అనుబంధం లేదనిపించింది. సాయం చేసిన ఒక వ్యక్తికి థ్యాంక్స్ చెప్పకపోతే ఆ భావోద్వేగం ఎలా సంపూర్ణమవు తుందనిపించింది. అది నా మైండ్‌లో అలాగే ఉండిపోయింది. ఒక ప్రేక్షకుడిగా అప్పుడు నా ఎమోషన్ తృప్తి చెందలేదు. అందుకే 'మగధీర'లో ఇసుక ఊబిలో కూరుపోయిన చరణ్ బయటకు వచ్చిన తర్వాత తన గుర్రాన్ని కౌగలించుకుంటాడు. ఒక స్నేహితుడిలా చూస్తూ దానితో కృతజ్ఞత భావంతో మాట్లాడతాడు. అలా నా సినిమాల్లో బలమైన సన్నివేశాలు ప్రేక్షకుల ఆలోచనల నుంచి స్ఫూర్తి పొంది రాసినవే ఉంటాయని రాజమౌళి చెప్పుకొచ్చారు.

## కృష్ణాష్టమి వేడుకలు..
## ట్రోల్స్‌పై స్పందించిన జాన్వీ కపూర్

తనపై వస్తోన్న ట్రోల్స్‌కు జాన్వీకపూర్ వివరణ ఇచ్చారు. తాజాగా ముంబయిలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలకు జాన్వీకపూర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అక్కడ ఉట్టికొట్టే సంబరంలో ఆమె పాల్గొన్నారు. అయితే, 'భారత్ మాతాకీ జై' అంటూ జాన్వీ ఉట్టి కొట్టడంతో కొందరు ఆమెను ట్రోల్స్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం, కృష్ణాష్టమి వేరు అంటూ పోస్ట్‌లు పెట్టారు. తాజాగా దీనిపై ఈ బ్యూటీ వివరణ ఇచ్చారు. "అక్కడ పాల్గొన్నవారు ముందు 'భారత్ మాతాకీ జై' అని అన్నారు. ఆ తర్వాత నేను అన్నాను. వారి వీడియోను కట్ చేసి నా మాటలను మాత్రమే వైరల్ చేస్తున్నారు. అయినా దేశాన్ని పొగడడానికి ఒక రోజంటూ ప్రత్యేకంగా ఉండదు. జన్మాష్టమి నాడు మాత్రమే కాదు.. నేను ప్రతిరోజూ 'భారత్ మాతాకీ జై' అని చెబుతాను" అంటూ తన ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ పెట్టారు. ఇక ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాన్వీ మరాఠీలో మాట్లాడి అందరినీ ఆకట్టుకున్నారు. ఆగస్టు 29న విడుదల కానున్న తన తాజా చిత్రం 'పరమ్ సుందరి'ని చూడాలని కోరారు. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీకపూర్ జంటగా తెరకెక్కిన చిత్రం 'పరమ్ సుందరి'. తుషార్ జలోటా దర్శకత్వం వహించారు. కేరళ అమ్మాయిగా జాన్వీ, దిల్లీ అబ్బాయిగా సిద్ధార్థ్ కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన ట్రైలర్, పాటలు మంచి ఆదరణను సొంతం చేసుకున్నాయి. "ఈ ప్రపంచంలో కోట్లాది మంది ప్రజలు ఉన్నారు. కానీ నిజమైన ప్రేమ ఒకరితోనే ఉంటుంది" అనే డైలాగు ప్రేక్షకులను ఆకట్టుకుంది.

# హీరో సూర్యతో వెంకీ అట్లూరి మూవీ



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం తన 46వ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం చుట్టూ ఇప్పటికే మంచి హైప్ క్రియేట్ అయింది. అయితే ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ నటించనున్నారన్న వార్తలు ఇటీవల వైరల్ అయ్యాయి. ఈ రూమర్స్‌పై తాజాగా దర్శకుడు వెంకీ అట్లూరి స్పందిస్తూ.. అనిల్‌కపూర్‌ను మేము ఎప్పుడూ కలవలేదు. ఆయనతో ఫోన్‌లో కూడా మాట్లాడలేదు. కానీ, ఎక్కడి నుంచి ఈ వార్తలు పుట్టుకొచ్చాయో మాకు తెలియదు. ఇలాంటి రూమర్స్‌ను నమ్మకండి. అధికారికంగా మేము చెప్పిన సమాచారాన్నే నమ్మండని స్పష్టం చేశారు. 'సార్' , 'లక్కీ భాస్కర్' సినిమాల తర్వాత వెంకి అట్లూరి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద అంచనాలు రెట్టింపయ్యాయి. ఇందులో మమితాబైజు హీరోయిన్‌గా, అలాగే రవీనా టాండన్, రాధిక శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ 'సూర్య 46' చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతోంది. మేకర్స్ ఈ సినిమాను వచ్చే 2026 వేసవిలో విడుదల చేయాలని భావిస్తున్నారు. సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇటీ-వల రిలీజ్ చేసిన సూర్య బర్త్ డే పోస్టర్ కు మంచి స్పందన లభించింది. కథకు తగ్గట్టు ఈ టైటిల్ పర్ఫెక్ట్ గా సెట్ అవుతుందని అందుకే ఆ టైటిల్ ను ఫిక్స్ చేసారని సమాచారం. త్వరలోనే ఈ సినిమా -టైటిల్ ను అఫీషియల్ గా ప్రకటించబోతున్నారట.

## కోట శ్రీనివాసరావు
# ఇంట మరో విషాదం



**హైదరాబాద్:** దివంగత నటుడు కోట శ్రీనివాసరావు ఇంట మరో విషాదం నెలకొంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సతీమణి రుక్మిణి సోమవారం కన్నుమూశారు. కోట శ్రీనివాసరావు జులై 13న తుది శ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన ఇకలేరన్న వార్త మరువక ముందే కోట సతీమణి మృతి చెందడం కుటుంబ సభ్యులతో పాటు, అందరినీ కలచి వేస్తోంది. కోట నట జీవితంలో పడి కుటుంబాన్ని సరిగా పట్టించుకోలేకపోయానని అనేకసార్లు పంచుకున్నారు. షూటింగ్స్ ఉండి నెలకో, రెండు నెలలకో ఓసారి ఇంటికి వచ్చిన సందర్భాలున్నాయన్నారు. తన పిల్లలు చిన్నతనంలో అచ్చటా ముచ్చట పెద్దగా చూసుకుంది లేదని బాధపడ్డారు. ఇక పిల్లలు చదువుకుని బుద్ధిమంతులవడానికి తన సతీమణితో పాటు ఇతర కుటుంబ సభ్యులే కారణమని తెలిపారు. కోట శ్రీనివాసరావుకు ఓర్పు ఎక్కువని, అందరితోనూ సరదాగా ఉంటారని రుక్మిణి ఓ సందర్భంలో పంచుకున్నారు. ఆయన నటించిన చిత్రాల్లో 'అహనా పెళ్లంట' అంటే తనకెంతో ఇష్టమని తెలిపారు.




## విడుదలకు సిద్ధంగా
# అనుష్క ఘాటి

టాలీవుడ్ బ్యూటీ అనుష్కా శెట్టి నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఘాటి క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. కాగా మేకర్స్ మ్యూజికల్ అప్‌డేట్ అందించారు. ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు మేకర్స్. దస్సోరా సాంగ్‌ను ఆగస్టు 20న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు- కొత్త లుక్ విడుదల చేశారు. విక్రమ్ ప్రభు, అనుష్క తమ భుజాలపై భారీ మూటలు మోస్తూ కొండలపై నుంచి వస్తున్న లుక్ పాటపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ పాటను నాగవెల్లి విద్యాసాగర్ కంపోజ్ చేశాడు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్-టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో చైతన్య రావ్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏప్రిల్‌లోనే విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడుతూ వస్తోన్న నేపథ్యంలో నిరాశ చెందుతున్న అభిమానులు, ఫాలోవర్లు ప్రమోషన్స్‌ను వేగవంతం చేయాలని అనుష్క టీంకు రిక్వెస్ట్‌లు పెడుతున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదల చేసిన జనాలంతా కొండ ప్రాంతం మధ్యలోని దారి వెంట మూటలు మోసుకొని వెళ్తున్న లుక్‌తోపాటు- గ్లింప్స్ సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఘాటి అమెజాన్ ప్రైమ్ వీడియోలో పోస్ట్ థియాట్రికల్ రిలీజ్ కానుంది.




## థమా సినిమా అప్డేట్‌తో
# హైప్ పెంచిన మూవీ మేకర్స్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నా ఇటీవల ఛావా, కుబేర వంటి చిత్రాలతో వరుస హిట్స్ సాధించింది. ప్రస్తుతం అదే ఫామ్‌లో భాషతో సంబంధం లేకుండా భారీ ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది. ఇన్నాళ్లూ లవ్ స్టోరీస్‌లో నటించిన నేషనల్ క్రష్ హారర్ మూవీతో భయపెట్టేందుకు సిద్ధమవుతోంది. త్వరలో 'థమా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజాగా, మూవీ మేకర్స్ రష్మిక మందన్నా క్యారెక్టర్‌కు సంబంధించిన లుక్ విడుదల చేసి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇందులో ఈ భామ తడాకా పాత్రలో నటిస్తున్నట్లు తెలుపుతూ పోస్టర్ షేర్ చేశారు. ఇక ఇందులో గ్రీన్ కలర్ గౌన్ ధరించిన రష్మిక ఫ్రీ హెయిర్‌తో కళ్లతో కాటుక పెట్టుకుని చేతులను ఓ పొజిషన్‌లో పెట్టి కనిపించింది. ఇక ఈ పోస్ట్‌కు "థమా అప్డేట్ ఆగస్టు 19న ఉదయం 11:11 గంటలకు రాబోతుంది. ఈ దీపావళికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న థియేటర్స్‌లో రక్తపు ప్రేమకథను అందిస్తుంది" అనే క్యాప్షన్ చేశారు. కాగా.. ఈ సినిమాకు ఆదిత్య సర్పోట్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని మడాక్స్ ఫిల్మ్స్, దినేష్ విజన్ ప్రజెంట్స్ బ్యానర్స్‌పై అమర్ కౌశిక్, దినేష్ విజన్ నిర్మిస్తున్నారు. ఇందులో అయుష్మాన్ ఖురానా అలోక్ పాత్రలో నటిస్తున్నాడు. నవాజుద్దీన్ సిద్ధిఖీ అంధేరే కా బాద్‌షా యక్షాసన్ పాత్రలో కనిపించనుండగా.. పరేశ్ రావల్ రామ్ బాలాజీ గోయల్‌గా చేస్తున్నాడు. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం ఫస్ట్ లుక్‌ను కూడా విడుదల చేశారు. ప్రస్తుతం ఈ పోస్టర్లు ప్రేక్షకుల్లో అంచనాలను పెంచుతున్నాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com